జాతీయ దినపత్రిక

Postal Licence No. L/KNL/3-52(D) 2018 - 2020

# ఉదయం న్యూస్

ఎడిటర్ : సి. శేఖర్ యం


Published from Kurnool ---- Circulated by Andhrapradesh, Telangana & New Delhi

సంపుటి :04 సంచిక :321 పేజీలు 8 వెల : 5 మంగళవారం 28 జూలై 2026









# ఉత్తరాంధ్ర గ్రోత్ ఇంజన్‌గా భోగాపురం ఎయిర్‌పోర్టు

## విమానాశ్రయ ప్రారంభోత్సవంపై సిఎం చంద్రబాబు సమిక్ష

అమరావతి: భోగాపురం ఎయిర్ పోర్టుతో ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు వచ్చినట్లు అవుతుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ఉత్తరాంధ్ర ఆర్థిక, పారిశ్రామిక, పర్యాటక రంగాలకు గ్రోత్ ఇంజిన్‌గా భోగాపురం మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. సోమవారం రాజధాని అమరావతిలో భోగాపురంలో అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవంపై ఏపీ సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆగస్టు 1వ తేదీన ప్రధాని మోదీ చేతుల మీదుగా ఈ విమానాశ్రయం ప్రారంభం అవుతుందని తెలిపారు. 2,703 ఎకరాల విస్తీర్ణంలో రూ.4,727 కోట్లతో ఈ ప్రాజెక్టు చేపట్టినట్లు వివరించారు. ఈ విమానాశ్రయంలో 3,800 మీటర్ల రన్‌వే ఉందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమం విజయవంతం చేసేందుకు అధికారులకు సీఎం కీలక ఆదేశాలు జారీ చేశారు. అలాగే భద్రత, ట్రాఫిక్, అతిథుల స్వాగత ఏర్పాట్లపై కీలక సూచనలు చేశారు. ప్రతి శాఖ సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని అధికారులకు సీఎం స్పష్టం చేశారు. ప్రధాని పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని అన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్‌తో పాటు పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఈ సమిక్షా సమావేశంలో పాల్గొన్నారు.

**తొలి దశలో ఏటా 60 లక్షల మంది ప్రయాణికుల సామర్థ్యం ఈ విమానాశ్రయం కలిగి ఉందన్నారు. 500 ఎకరాల్లో ఏవియేషన్ హబ్, 136 ఎకరాల్లో ఏవియేషన్ ఎడ్యుసిటీ ఏర్పాటు చేసినట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. ఆగస్టు 1వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభం కానుంది.**




## తక్కువ ధరలకే నాణ్యమైన బియ్యం

ఆగస్ట్ 1 నుంచి రాష్ట్రంలో అమలు

డిసప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ వెల్లడి




## కృష్ణా జలాల్లో వాటాకు ఎపి డిమాండ్

బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పును సవాల్ చేసిన ఎపి

విచారణను సెప్టెంబర్‌కు వాయిదా వేసిన సుప్రీం



# అర్హులందరికి సంక్షేమ పథకాలు

అనకాపల్లి: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. పాయకరావుపేట మండలం పాల్మన్ పేటలో 'రెండేళ్ల నమ్మకం అభివృద్ధి సంక్షేమం' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికి వెళ్లి రెండేళ్లలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన పథకాలను వివరించారు. కరపత్రాలు పంచారు. రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం సమ ప్రాధాన్యంతో సాగుతున్నాయని వివరించారు. యువతకు ఉపాధి కల్పించేందుకు పరిశ్రమల ఏర్పాటు చేస్తున్నారని పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి చిరునామాగా మారుతుందని చెప్పారు. పాయకరావుపేట నియోజకవర్గం పరిశ్రమలకు పర్యాటక రంగానికి కేరాఫ్ అడ్రస్‌గా మారుస్తున్నామని వెల్లడించారు.




# ఆకలితో ఏ విద్యార్థి ఉండకూడదు

**సహజ వనరులు ఎంత ముఖ్యమో, మానవ వనరులు కూడా అంతే ముఖ్యమని పేర్కొన్న డిప్యూటీ సీఎం.. మానవ వనరుల అభివృద్ధిపై పెట్టుబడి పెడితేనే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 22 లక్షల మంది విద్యార్థులకు ప్రతిరోజూ అల్పాహారం అందించడం చిన్న విషయం కాదని, ఇది దేశంలోనే కాక ప్రపంచ స్థాయిలో కూడా అరుదైన కార్యక్రమమని వ్యాఖ్యానించారు.**

ఆర్థిక ఇబ్బందులు ఉన్నా పథకం ప్రారంభిస్తున్నాం

విద్యార్థుల సంక్షేమమే మా ప్రభుత్వ లక్ష్యం

అల్పాహార పథకాన్ని ప్రారంభించిన డిప్యూటీ సీఎం భట్టి




## పీహెచ్‌సీల పనితీరుకు 'ఆరోగ్య ఫలితాలే' ప్రామాణికం

సేవల సంఖ్య ఆధారిత ర్యాంకుల విధానానికి స్వస్తి

మాతా శిశు ఆరోగ్యం నుంచి ప్రజల సంతృప్తి వరకు 21 అంశాల ఆధారంగా మార్కులు

మాతృత్వ మరణాలు, సిజేరియన్లు తగ్గిన ఆసుపత్రులకు ర్యాంకింగ్ లో ప్రాధాన్యం

రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్

## కోలుకుంటున్న పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల



అమరావతి: ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కోలుకుంటున్నారు. ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని ఆస్త్రప్రి వర్గాలు తెలిపాయి. శనివారం హైదరాబాద్ కాంటినెంటల్ ఆసుపత్రిలో చేసిన శస్త్ర చికిత్స విజయవంతమైంది. ఇటీవల కొద్దిరోజులు తీవ్ర కడుపునొప్పితో బాధపడిన ఆమె ఉదయం ఆస్పత్రిలో చేరగా వైద్యులు వెంటనే పరీక్షలు జరిపి.. శస్త్ర చికిత్స చేశారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడ ఉందని ధ్రువీకరిస్తూ ఏపీసీసీ అధికారిక ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేసింది. కాగా, ఈ విషయం తెలుసుకున్న సీఎం చంద్రబాబు..

షర్మిల త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. షర్మిల సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజాక్షేత్రంలోకి రావాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్లు ఎక్స్‌లో పేర్కొన్నారు. మంత్రి లోకేశ్ కూడా షర్మిల త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.




## హైడ్రా కమిషనర్‌ను తొలగించండి

పదేపదే కోర్టు ఉల్లంఘనలకు పాల్పడడంపై ఆగ్రహం

ఇలాంటి వ్యక్తి అదే పోస్టులో కొనసాగడం సరికాదు

లోతుకుంట భూముల వ్యవహారంపై హైకోర్టు విచారణ

కోర్టులంటే గౌరవం ఉందంటూ క్షమాపణలు కోరిన రంగనాథ్




## ఆందోళనల నడుమే లోక్‌సభ వాయిదా పేపర్ లీకుల బిల్లుపై నేడు చర్చ




## ఆ విమాన ప్రమాదం చిన్న ఘటన కాదు

ఉదయం న్యూస్
ఎడిటర్ : సి. శేఖర్ యం

## విద్యార్థిని శివాని ఆత్మహత్యపై చంద్రబాబు షాక్

**తీవ్రంగా కలచివేసిందంటూ ఎక్స్‌లో పోస్ట్**

అమరావతి: పోలవరం జిల్లా ఈర్లపల్లికి చెందిన పదో తరగతి విద్యార్థిని ముర్రం శివాని ఆత్మహత్య చేసుకోవడంపై ఏపీ సీఎం చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. మెగా పీటీఎంలో ఎంతో ఉత్సాహంగా మాట్లాడిన విద్యార్థిని మృతి తనను కలచివేస్తోందన్నారు. ఈ మేరకు 'ఎక్స్'లో ఆయన పోస్ట్ చేశారు. పదో తరగతి విద్యార్థిని ముర్రం శివాని తనువు చాలించడం నన్ను తీవ్ర విషాదంలోకి నెట్టేసింది. రంపచోడవరంలో నిర్వహించిన మెగా పీటీఎంలో వేదికపై ఎంతో ఉత్సాహంగా మాట్లాడిన విద్యార్థిని బలవన్మరణం ఆవేదన కలిగించింది. ఆరోజు తన చదువు, ఉన్నత లక్ష్యాల గురించి శివాని నాతో చెప్పిన మాటలు గుర్తుకొస్తున్నాయి. ఎంతో భవిష్యత్ ఉన్న గిరిజన బిడ్డ ఇలా తనువు చాలించడం బాధాకరం. కారణాలు ఏవైనా తన కలలు నిజం కాకుండానే ఆ విద్యార్థిని దూరమవడం కలచివేస్తోంది. శివాని మృతిపై పూర్తి దర్యాప్తు జరపాలని అధికారులను ఆదేశించాను. సమస్యలు, కష్టాలు వచ్చినా విద్యార్థులు, యువత ధైర్యంగా నిలబడాలి. ఎవరూ ఒత్తిడి, నిరాశ, నిస్పృహలకు లోను కావొద్దు. ఎంతటి సమస్యకైనా పరిష్కారం ఉంటుంది. మీ బాధ, ఆవేదనను కుటుంబ సభ్యులు, స్నేహితులు, ఆత్మీయులతో పంచుకోండి. ఒత్తిడిని అధిగమించి మీ కలలను నిజం చేసుకునేలా ముందుకు సాగండి. ప్రభుత్వం అన్ని విధాలుగా మీకు అండగా ఉంటుందని చంద్రబాబు పేర్కొన్నారు. రంపచోడవరం మెగా పీటీఎంలో ఎంతో ఆత్మవిశ్వాసంతో మాట్లాడిన శివాని మృతి తీవ్ర విషాదాన్ని నింపిందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'విషయం తెలిసినప్పటి నుంచి శివాని మాటలు పదేపదే గుర్తొస్తున్నాయి.

సోదరి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నా. ఎంత కష్టమైనా పోరాడుదాం.. ఎంతటి సమస్యనైనా ఎదుర్కొందాం.. మీకు నేనున్నాను.. ఈ ప్రభుత్వం ఉందని లోకేశ్ పేర్కొన్నారు.

## వరుస నష్టాలకు బ్రేక్

**లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు**

ముంబై:వరుసగా ఐదు ట్రేడింగ్ సెషన్ల పాటు నష్టాలను చవిచూసిన దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం బలంగా పుంజుకున్నాయి. కొనుగోళ్లు ఊపందుకోవడంతో ప్రధాన సూచీలన్నీ లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 776.01 పాయింట్లు ఎగబాకింది. నిఫ్టీ 228.5 పాయింట్లు పెరిగి 24 వేల మార్కుకు చేరువైంది. ప్రపంచ మార్కెట్ ర్యాలీ సహా అమెరికా, ఇరాన్‌లు సైనిక దాడులను నిలిపివేస్తామనే నిర్ణయం నేపథ్యంలో ముడి చమురు ధరలు తగ్గడంతో భారత ఈక్విటీలు ఈ వారాన్ని బలంగా ప్రారంభించాయి. ఐటీ, మీడియా, రియాల్టీ, ఆటో, ఫార్మా రంగాల షేర్లలో కొనుగోళ్లు మార్కెట్‌కు ప్రధాన బలంగా నిలిచాయి. ఇక రంగాల వారీగా చూస్తే.. నిఫ్టీ మీడియా సూచీ 2.50 శాతం లాభంతో అగ్రస్థానంలో నిలిచింది. మరోవైపు.. నిఫ్టీ ఆయిల్ అండ్ గ్యాస్ మాత్రం స్వల్ప నష్టం(0.12శాతం)తో ముగిసింది. నిఫ్టీ సూచీలో ఎటర్నల్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, ఇన్ఫోసిస్, బజాజ్ ÷నాన్స్, శ్రీరామ్ ఫైనాన్స్ షేర్లు గరిష్ఠ లాభాలను నమోదు చేయగా.. ఓఎన్‌జీసీ, సిఎ÷-లా, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, అదానీ పోర్ట్స్ షేర్లు ఒత్తిడికి లోనై నష్టాలను చవిచూశాయి. అటు.. విదేశీ మారకద్రవ్య మార్కెట్లో రూపాయి కూడా బలపడింది. అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి 68 పైసలు పెరిగి డాలర్‌కు ?95.89 వద్ద ముగిసింది. గత ట్రేడింగ్ సెషన్‌లో రూపాయి ?96.57 వద్ద ముగిసింది.

## విజయ్ ప్రభుత్వానికి మద్రాస్ హైకోర్టులో ఎదురుదెబ్బ

చెన్నై:తమిళనాడు సిఎం విజయ్ ప్రభుత్వానికి మద్రాస్ హైకోర్టులో ఎదురుదెబ్బ
తగిలింది. కరూర్ తొక్కిసలాటలో మృతి చెందిన వారి కుటుంబాలకు ఇచ్చిన ఉద్యోగాలు చెల్లవని ఉన్నత న్యాయస్థానం తేల్చి చెప్పింది. రాజ్యాంగ పరిమితులకు లోబడి ప్రభుత్వం వ్యవహరించాలని సూచించింది. ప్రభుత్వ చర్యలపై నియంత్రణ లేకపోతే.. అరాచకం, అశాంతి రాజ్యమేలుతాయని పేర్కొంది. ప్రభుత్వ ఉద్యోగం అనేది ఉచితంగా పంచిపెట్టేది కాదు. దాన్ని కష్టపడి సాధించాలి. ప్రభుత్వ ఉద్యోగం కోసం ఎంతోమంది ఎదురుచూస్తున్నారని వ్యాఖ్యానించింది. గతేడాది సెప్టెంబర్‌లో జరిగిన టీవీకే ర్యాలీలో చోటుచేసుకున్న తొక్కిసలాటలో 41 మంది మరణించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బాధితుల కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తామని విజయ్ హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మరోసారి కరూర్ వెళ్లి అర్హతలున్న 32 మందికి వివిధ ప్రభుత్వ శాఖల్లో తాత్కాలిక నియామక పత్రాలను అందజేశారు. దీనిపై అన్నాడీఎంకే నేత ఆర్.బి. ఉదయ్‌కుమార్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. చట్టపరమైన విధానాలను పక్కనపెట్టి తాత్కాలిక ప్రాతిపదికన ఉద్యోగాలు ఇచ్చారంటూ హైకోర్టును ఆశ్రయించారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎంతో మంది యువత తీవ్రంగా శ్రమిస్తున్నారని, ప్రభుత్వం ఏ ఉద్యోగ నియమాక పక్రియ చేపట్టినా తమిళనాడు పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారానే చేపట్టాలని కోరారు. దీనిపై తాజాగా విచారణ చేపట్టి న్యాయస్థానం సీఎం విజయ్ చేపట్టిన ఈ నియామకాలు చెల్లబోవని తీర్పునిచ్చింది.

## ఆ విమాన ప్రమాదం చిన్న ఘటన కాదు

న్యూఢిల్లీ: అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన దుర్ఘటనపై రాజ్యసభలో కేంద్రం కీలక వ్యాఖ్యలు చేసింది. తుది నివేదికల విడుదలపై తలెత్తుతున్న ప్రశ్నలపై బదులిస్తూ.. ఈ కేసు దర్యాప్తులో ఎటువంటి ఆలస్యం జరగలేదని స్పష్టంచేసింది. అదేమీ చిన్న సంఘటన కాదని.. అటువంటి భారీ ప్రమాదాల దర్యాప్తును పూర్తి చేయడానికి సమయం పడుతుందని తెలిపింది. భారీ విమాన ప్రమాదాల దర్యాప్తు అనేక అంశాలు.. వేర్వేరు పరిస్థితులపై ఆధారపడి ఉంటుందని.. అందువల్ల తుది నివేదిక కోసం ఎంత సమయం పడుతుందనే విషయాన్ని ముందుగానే అంచనా వేయడం సాధ్యం కాదని వెల్లడించింది.

ప్రమాదానికి గల కారణాలను సమగ్రంగా నిర్ధరించడానికి ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో కృషి చేస్తోందని పౌర విమానయానశాఖ పేర్కొంది. నిర్దేశిత విధానాల ప్రకార దర్యాప్తు కొనసాగుతోందని తెలిపింది. ప్రమాదానికి దారితీసిన అన్ని కారణాలు, ఇతర అంశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్టు వెల్లడించింది. అయితే ఈ ఘటనపై ఇప్పటివరకు ఎటువంటి తుది నిర్ణయానికి రాలేదని వెల్లడించింది. ప్రస్తుతం విమాన 'థ్రస్ట్ కంట్రోల్ మాడ్యూల్' ను తనిఖీ చేసే పక్రియ జరుగుతోందని తెలిపింది. గతేడాది అహ్మదాబాద్‌లో టేకాఫ్ అయిన వెంటనే ఎయిరిండియా విమానం కుప్పకూలిన ఘటనలో 241 మంది ప్రాణాలు కోల్పోవడం అందరినీ విషాదానికి గురిచేసిన విషయం తెలిసిందే

# కేంద్రం హామీలు బుట్టదాఖలు

న్యూఢిల్లీ: నిరసనకారులపై పోలీసు చర్యలు కొనసాగుతున్నాయని, కేసుల ఉపసంహరణనపై కేంద్రం తమకు ఇచ్చిన మాటను ఉల్లంఘిస్తోందని 'కాక్రోచ్ జనతా పార్టీ' ఆరోపించింది. మళ్లీ దేశవ్యాప్త నిరసనలు ప్రారంభిస్తామని హెచ్చరించింది. కేంద్ర విద్యశాఖ మంత్రిగా ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తర్వాత సీజేపీ తన నిరసనను విరమించింది. కేంద్రంతో చర్చల సమయంలో విద్యార్థులపై కేసులు ఎత్తివేతపై కేంద్రం అంగీకరించిందని సీజేపీ చెబుతోంది. కేసులు విత్ డ్రా చేయకుపోతే నేటి నుంచి మళ్లీ ఉద్యమిస్తామని హెచ్చరించారు. నిరసనకారులపై నమోదైన అన్ని ఎఫ్ఐఆర్‌లను వెంటనే ఉపసంహరించుకోవాలని, అదుపులోకి తీసుకున్న విద్యార్థులను విడుదల చేయాలని మరియు వాలంటీర్లపై నిఘా, వేధింపులను ఆపాలని సీజేపీ డిమాండ్ చేసింది. నిరసనకారులపై ఎలాంటి చర్యలు తీసుకోబోమని ప్రభుత్వం ఇచ్చిన హామీని ఉల్లంఘిస్తోదని సీజేపీ ప్రతినిధి అశుతోష్ రాంకా ఎక్స్‌లో ఆరోపించారు. బీహార్, బెంగాల్‌లలో వందలాది విద్యార్థులను అరెస్ట్ చేస్తున్నారని, ఢిల్లీ, ఇతర రాష్ట్రాల్లో వందలాది మందిపై నిఘా ఉంచి వేధిస్తున్నారని, నిరసనకారులకు లాజిస్టిక్స్ సపోర్ట్ అందించిన వాలంటర్లను వేధిస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు కాక్రోచ్ జనతా పార్టీ అధికార ప్రతినిధి



సౌరవ్ దాస్ కీలక వ్యాఖ్యలు చేశారు. కేసుల్లో చిక్కుకున్న విద్యార్థుల న్యాయసహాయం కోసం 'సాక్షి' అనే ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ ప్రారంభించినట్లు సీజేపీ ప్రకటించింది. తమకు ఇచ్చిన హామీని కేంద్రం నిలబెట్టుకోవట్లేదని ఆరోపించారు. పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసన చేపట్టిన ఆందోళనకారులపై నమోదైన కేసులు ఉపసంహరించు కుంటామని కేంద్ర మంత్రులు తమకు హామీ ఇచ్చారని పేర్కొన్నారు. అందువల్లే తాము నిరసనలు నిలిపివేశామన్నారు. కానీ, ఇంతవరకూ విద్యార్థులు, ఇతర నిరసనకారులపై పెట్టిన కేసులను ఎత్తివేయలేదని తెలిపారు. అస్సాం, పశ్చిమ బెంగాల్, బిహార్ వంటి రాష్ట్రాల్లో పలువురు ఆందోళనకారులను అరెస్టు చేసినట్లు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. ఈ కేసుల గురించి న్యాయవాదులను సంప్రదిస్తున్నామని సౌరవ్ పేర్కొన్నారు. తమకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కేంద్రానికి మరోసారి గుర్తు చేస్తున్నట్లు తెలిపారు. రేపటిలోగా దేశవ్యాప్తంగా ఆందోళన కారులపై నమోదైన అన్ని కేసులు ఉపసంహరించు కోవాలని.. నిర్బంధంలో ఉన్న నిరసనకారులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే తమ తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని అన్నారు. ఈ విషయంలో కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్ తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరారు. నిరసనకారులపై నమోదైన అన్ని ఎఫ్ఐఆర్‌లను తక్షణమే ఉపసంహరించుకోవాలని, మరియు బీజేపీ పాలిత లేదా బీజేపీ ఢిల్లీ పోలీసులు, కేంద్ర దర్యాప్తు సంస్థలు లేదా పోలీసు బలగాలు కొత్త కేసులు నమోదు చేయకూడదని సీజేపీ డిమాండ్ చేశారు.

అలా చేయని పక్షంలో మళ్లీ నిరసనలో కూర్చుంటామని కేంద్రానికి అల్టిమేటం జారీ చేసింది. కేసులు ఎత్తేస్తామనే హామీని లిఖితపూర్వకంగా తమకు బుధవారం లోగా ఇవ్వాలని సీజేపీ కోరింది. సోమవారం నాడు సీనియర్ సుప్రీం కోర్టు న్యాయవాది మరియు ఎస్పీ రాజ్యసభ ఎంపీ కపిల్ సిబల్‌తో కలిసి నిర్వహించిన సంయుక్త విలేకరుల సమావేశంలో, సీజేపీ ప్రతినిధి సౌరవ్ దాస్ మాట్లాడుతూ, ప్రభుత్వం తమ డిమాండ్లను అంగీకరించిన తర్వాత జూలై 25న ఆందోళనను విరమించుకున్నామని, అయితే ఆందోళన తగ్గుముఖం పట్టిన కొద్దీ విద్యార్థులను ఒక్కొక్కరిగా లక్ష్యంగా చేసుకుంటారని తాము ముందే ఊహించామని తెలిపారు.

# హైడ్రా కమిషనర్‌ను తొలగించండి




హైదరాబాద్: హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు తెలంగాణ హైకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆయన్ను హైడ్రా కమిషనర్ పోస్టు నుంచి తప్పించాలని సీఎస్‌ను ఆదేశించింది. రంగనాథ్‌పై 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు ఉన్నాయని ఉన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టులను ఆశ్రయించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని పేర్కొంది. ఉన్నతాధికారిగా ఉన్న రంగనాథ్.. కోర్టు ఉత్తర్వులను ఇన్నిసార్లు ధిక్కరించడం సరికాదని ఆక్షేపించింది. మల్కాజిగిరి పరిధిలోని లోతుకుంట భూములకు సంబంధించి గతంలో ఉన్నత న్యాయస్థానం ఆదేశాలను హైడ్రా ఉల్లంఘించిందంటూ శాంతా శ్రీరాం కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. హైకోర్టు ఆదేశాలు ఉన్నా.. ఫెన్సింగ్‌ను హైడ్రా సిబ్బంది తొలగించారని పేర్కొంది. ఒకే పిటిషన్‌కు సంబంధించి పలుమార్లు కోర్టు ఉత్తర్వులను హైడ్రా కమిషనర్ ధిక్కరించడం నేరమని హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ క్రమంలో కోర్టుకు ఆయన హాజరుకావాలని ఆదేశించింది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ జోక్యం చేసుకుని దీనిపై పూర్తిస్థాయిలో అఫిడవిట్ దాఖలు చేస్తామని తెలిపారు. అఫిడవిట్‌లో రంగనాథ్ క్షమాపణ కోరారు. కోర్టుల పట్ల పూర్తిస్థాయి నమ్మకముందని పేర్కొన్నారు. లోతుకుంట సర్వే నంబర్ 1, 2లో ఉన్న 40 ఎకరాల భూమిలోకి వెళ్లలేదని తెలిపారు. దీనిపై స్పందించిన హైకోర్టు.. రంగనాథ్‌పై 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు ఉన్నాయని, దీనికి కారణమేంటని ప్రభుత్వం తరఫు న్యాయవాదిని ప్రశ్నించింది. ఈ క్రమంలో రంగనాథ్‌ను తొలగించాలని పేర్కొంటూ.. ఆయన స్థానంలో మరొకరిని నియమించాలని ఆదేశించింది. లోతుకుంట భూముల వ్యవహారానికి సంబంధించి తెలంగాణ హైకోర్టులో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ కేసు విచారణ సందర్భంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. హైడ్రా కమిషనర్ పదవి నుంచి రంగనాథ్‌ను తొలగించాలంటూ.. తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆదేశాలు జారీ చేసింది. సెక్రటరీ ర్యాంక్ స్థానంలో ఉన్న ఉన్నతాధికారి.. కోర్టు ఉత్తర్వులను ధిక్కరించడం ఏ మాత్రం సమంజసం కాదని ధర్మాసనం పేర్కొంది. అర్హత కలిగిన అధికారిని హైడ్రా కమిషనర్‌గా నియమించాలని హైకోర్టు సూచించింది. 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లపై ఆగ్రహం వ్యక్తం చేసిన న్యాయస్థానం.. లోతుకుంట ప్రైవేటు భూములపై హైడ్రా జోక్యాన్ని తప్పుబట్టింది. హైడ్రా కమిషనర్‌గా రంగనాథ్ కొనసాగితే రూల్ ఆఫ్ లా తప్పుతుందని పేర్కొంది. ఇన్ని ఉల్లంఘనలకు పాల్పడుతున్న అధికారిని ఇంకా అదే పోస్టులో కొనసాగించడం సరికాదని.. రంగనాథ్‌ను తొలగించడం తప్ప మరో ఆప్షన్
లేదని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. ఈ కేసు విచారణ సందర్భంగా హైకోర్టుకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ క్షమాపణలు తెలిపారు. కోర్టులు, న్యాయ వ్యవస్థపై తనకు ఎంతో నమ్మకం ఉందని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అలాగే లోతుకుంట సర్వే నంబర్లు 1, 2 పరిధిలోని 40 ఎకరాల భూమిలోకి హైడ్రా బృందం వెళ్లలేదని కోర్టుకు

వివరించారు. ఈ విషయంలో పిటిషనర్ అసత్య ఆరోపణలు చేస్తున్నారని కూడా రంగనాథ్ తన అఫిడవిట్‌లో తెలిపారు.

-----------

# సింగరేణిని భ్రష్టు పట్టించిన కెసిఆర్

**కాంగ్రెస్ వచ్చినా మారని పరిస్థితి**

**కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విమర్శలు**

న్యూఢిల్లీ: గత బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణికి తీవ్ర నష్ట చేకూర్చిందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా సింగరేణి మెరుగుపడటం లేదని వ్యాఖ్యానించారు. కేంద్రం 49 శాతం, తెలంగాణ ప్రభుత్వం 51 శాతం వాటాతో సింగరేణి కొనసాగుతోందని కేంద్ర మంత్రి తెలిపారు. దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద బొగ్గు కంపెనీ సింగరేణి అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. సింగరేణి నుంచి కర్ణాటక, ఏపీ, మహారాష్ట్ర, ఎన్‌టీపీసీ కి బొగ్గు సరఫరా అవుతుందని తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్.. సింగరేణికి తీరని ద్రోహం చేశారని కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణి ఆదాయానికి గత ప్రభుత్వం గండికొట్టిందని ఆరోపించారు. రాజకీయ వేదికలకు సింగరేణిని వాడుకున్నారంటూ బీఆర్ఎస్, కేసీఆర్‌పై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వింత ప్రవర్తన, మొండి వైఖరి వల్లే సింగరేణి సంస్థ తీవ్రంగా నష్టపోయిందని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2014లో సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగా బొగ్గు గనులను పారదర్శకంగా వేలం పాట ద్వారా కేటాయించాలని ఆదేశించినప్పటికీ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం వేలం పాటల్లో పాల్గొనకుండా నిర్లక్ష్యం వహించిందన్నారు. నూతన బొగ్గు



బ్లాకులు లభించక, ఆదాయ మార్గాలు మూసుకుపోయి సింగరేణి వెనుకబడిపోవడానికి కేసీఆర్ ద్రోహమే కారణమని ఆయన ఆరోపించారు. సంస్థను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకున్నారని, గతంలో కేంద్రం ఇచ్చే రూ. 525 కోట్ల నిధులను సక్రమంగా వినియోగించుకోలేకపోయారని విమర్శించారు. 2015లోనే ఒడిశాలోని నైని కోల్ బ్లాక్‌ను కేంద్ర ప్రభుత్వం సింగరేణికి కేటాయించినప్పటికీ, నాటి కేసీఆర్ ప్రభుత్వం ఒడిశా ముఖ్యమంత్రితో కనీసం మాట్లాడలేదని కిషన్ రెడ్డి గుర్తుచేశారు. అయితే, ఇటీవల ఒడిశాలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తాము చొరవ తీసుకుని నైని కోల్ బ్లాక్‌కు సంబంధించి అవసరమైన అన్ని అనుమతులను ఇప్పించినట్లు వెల్లడించారు. అలాగే తాడిచర్ల-2 బ్లాక్‌ను కూడా కేంద్రం సింగరేణికి కేటాయించిందని, మణుగూరులోని ఒక బ్లాక్‌ను వేలంలో ఉంచామని తెలిపారు.అయితే ఈ వేలంలో సింగరేణికి పోటీగా తెలంగాణ జెన్కో పాల్గొనడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. జెన్కో టెండర్ నుంచి తప్పుకుని, ఆ బ్లాకులు సింగరేణికి దక్కేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై సీఎంకు లేఖ రాయనున్నట్లు వెల్లడించారు. ఈ మూడు కొత్త బ్లాకులు సింగరేణికి దక్కితే సుమారు 6,500 మందికి ఉద్యోగావకాశాలు రావడంతో పాటు, 830 మిలియన్ మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిగి, దాదాపు రూ. 1.95 లక్షల కోట్ల టర్నోవర్‌తో సంస్థకు, రాష్ట్ర ప్రభుత్వానికి భారీగా ఆదాయం చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పబ్లిక్ పరీక్షల చట్టం గురించి మాట్లాడుతూ.. 2024లోనే ఎలాంటి డిమాండ్లు, నిరసనలు లేకపోయినా ముందస్తు జాగ్రత్తగా ఈ యాంటీ-పేపర్ లీక్ బిల్లును తీసుకొచ్చామని తెలిపారు. భవిష్యత్తులో ఎవరైనా పేపర్ లీకేజీలకు పాల్పడాలంటే భయపడేలా, గుండెలాగిపోయే స్థాయిలో అత్యంత కఠినమైన నిబంధనలతో ఈ చట్టాన్ని రూపొందించామని చెప్పారు. విద్యా వ్యవస్థలో మార్పుల కోసం ప్రతిపక్ష కాంగ్రెస్ కూడా స్వాగతిస్తుందని భావిస్తే, వారు చట్టాన్ని అడ్డుకునే ప్రయత్నం చేయడం విచారకరమన్నారు. ఫలితాలు వచ్చిన వేళ నిరాశతో విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, వారిలో ధైర్యాన్ని నింపాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. చివరగా, ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన దాడి ఘటన తీవ్ర బాధాకరమని, దీనిపై ప్రస్తుతం సుప్రీంకోర్టు విచారణ జరుపుతోందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

## పీహెచ్‌సీల పనితీరుకు ఆరోగ్య ఫలితాలే ప్రామాణికం

అమరావతి: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరు మదింపులో కూటమి ప్రభుత్వం సమూల మార్పులకు శ్రీకారం చుట్టింది. ఎంతమంది రోగులకు సేవలందించారు? ఎన్ని పరీక్షలు చేశారు? ఎన్ని ప్రసవాలు నిర్వహించారు? అనే లెక్కలను మాత్రమే కాకుండా... అందించిన వైద్య సేవల వల్ల ప్రజల ఆరోగ్యంలో ఎంత మార్పు వచ్చింది? మాతా శిశు మరణాలు తగ్గాయా? రక్తపోటు, మధుమేహ రోగులకు నిరంతర చికిత్స అందుతోందా? లేదా? సేవలపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారా? అనే ఫలితాల ఆధారంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరును గుర్తించనున్నారు.ఇందుకోసం మొత్తం 21 కీలక పనితీరు సూచికలతో కొత్త ర్యాంకింగ్, గ్రేడింగ్ విధానాన్ని ప్రభుత్వం రూపొందించింది. 'సంజీవని', 'మాతృత్వ', 'క్షేమ' కార్యక్రమాలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరును అనుసంధానిస్తూ... గ్రామస్థాయి వైద్య వ్యవస్థను మరింత జవాబుదారీగా, ఫలితాల ఆధారితంగా, ప్రజలకు చేరువగా తీర్చిదిద్దడమే ఈ కొత్త ర్యాంకింగ్ విధానం ప్రధాన లక్ష్యమని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ప్రస్తుతం 5 అంశాల ఆధారంగానే వైద్యారోగ్య శాఖ ర్యాంకులను ప్రకటిస్తోంది. ఓపీ విధానంలో రోగుల సంఖ్య, ఆసుపత్రిలో చేరినవారు, ల్యాబ్ పరీక్షలు, ప్రసవాలు, గర్భనిరోధక సాధనాల వాడకం వంటి ఐదు అంశాల ఆధారంగానే పీహెచ్‌సీల పనితీరును అంచనా వేసేవారు. ఈ విధానంలో సేవల సంఖ్య మాత్రమే తెలుస్తోందని... వ్యాధుల నివారణలో సాధించిన పురోగతి, మాతా శిశు ఆరోగ్య ఫలితాలు, దీర్ఘకాలిక వ్యాధుల నియంత్రణ, రోగులకు నిరంతర చికిత్స వంటి కీలక అంశాలు ప్రతిబింబించడం లేదని అధికారుల పునస్సమీక్షలో తేలింది. ఈ విధానం అమలు, ఫలితాలపై రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ జారీ చేసిన ఆదేశాల మేరకు అధికారులు పునస్సమీక్ష జరిపారు. సేవలు మెరుగుపడాలంటే 21 కొలమానాల ఆధారంగా ర్యాంకులను ప్రకటించాల్సిన అవసరం ఉందని మంత్రికి నివేదించారు. వీటికి మంత్రి ఆమోదం తెలుపుతూ... గ్రామీణులకు వైద్య సేవలు అందించడంలో కీలకంగా ఉండే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరు ఈ కొత్త ర్యాంకింగ్ విధానంతో మరింత మెరుగుపడుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కేవలం సేవల సంఖ్యనే కాకుండా, వాటివల్ల ప్రజలకు కలిగిన ఆరోగ్య ప్రయోజనాలకు గుర్తింపునిస్తూ కొత్త ర్యాంకింగ్ విధానాన్ని రూపొందించారు.సదరు పీహెచ్సీ ల పరిధిలో నమోదయ్యే టీనేజ్ గర్భధారణలు, హైరిస్క్ గర్భిణుల నమోదు, గర్భధారణ కాలంలో అందించే వైద్య సేవలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు, సిజేరియన్ ప్రసవాల శాతం, మొత్తం సంతానోత్పత్తి రేటు, మాతృ మరణాల నియంత్రణను పరిగణనలోకి తీసుకోనున్నారు. కొత్త ర్యాంకింగ్‌లో ఇవి అత్యంత కీలకం కానున్నాయి. శిశు మరణాలు, తక్కువ బరువుతో జన్మించిన పిల్లలు, ఏడాదిలోపు శిశువులకు పూర్తిస్థాయిలో టీకాలు, పిల్లల్లో పుట్టుకతో వచ్చే లోపాలు, పోషకాహార లోపాలు, వ్యాధులు, ఎదుగుదలలో ఆలస్యాన్ని గుర్తించే పరీక్షలను కొత్త విధానంలో చేర్చారు. ఆరోగ్య సమస్యలున్న పిల్లలను గుర్తించి ఉన్నత వైద్య కేంద్రాలకు పంపించడంతోనే అధికారుల బాధ్యత ముగియదు. వైద్యాధికారి సూచించిన పిల్లలకు వాస్తవంగా చికిత్స అందిందా? లేదా? అన్న అంశాన్నీ పరిశీలిస్తారు. దీనివల్ల పరీక్షల దశ నుంచి చికిత్స పూర్తయ్యే వరకు ప్రతి దశలోనూ పిల్లల ఆరోగ్యాన్ని పర్యవేక్షించేందుకు వీలవుతుంది.మధుమేహం, అసంక్రమిత వ్యాధుల నియంత్రణకు కొత్త విధానంలో ప్రాధాన్యం ఇచ్చారు. అర్హులైన ప్రజల్లో రక్తపోటు మధుమేహం (ఆతిజీఎవబివబ), సాధారణ క్యాన్సర్ల పరీక్షలు ఎంతవరకు పూర్తయ్యాయి? వ్యాధి నిర్ధారణ అయిన వారికి క్రమం తప్పకుండా మందులు అందుతున్నాయా? వైద్య పరీక్షలు జరుగుతున్నాయా? అనే అంశాలను మదింపు చేస్తారు. క్యాన్సర్ అనుమానితులను గుర్తించి సకాలంలో ఉన్నత వైద్య కేంద్రాలకు పంపించడాన్ని కూడా పనితీరు సూచికగా చేర్చారు. దీంతో వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స అందించే అవకాశాలు పెరగనున్నాయి.పీహెచ్‌సీల్లో వైద్య సేవలు పొందిన ప్రజలు ఐవీఆర్ఎస్ (ఖీఉూ) ద్వారా తెలియజేసే అభిప్రాయాన్ని కూడా ర్యాంకింగ్‌లో భాగం చేశారు. వైద్యులు, సిబ్బంది ప్రవర్తన, ఆసుపత్రి పరిశుభ్రత, వేచి ఉండే సమయం, మందుల లభ్యత, రోగులకు ఇచ్చే గౌరవం వంటి అంశాలు ర్యాంకింగ్‌ను నిర్ణయించడంలో కీలకం కానున్నాయి. మొత్తం 21 కీలక పనితీరు సూచికల్లో ఒక్కో అంశానికి గరిష్ఠంగా ఒక పాయింట్ కేటాయిస్తారు. సాధించిన మొత్తం స్కోరును శాతంగా మారుస్తారు. లక్ష్యాన్ని ఎక్కువగా సాధించాల్సిన అంశాల్లో మెరుగైన ఫలితాలకు అధిక స్కోరు ఇస్తారు.

# ఆందోళనల నడుమే లోక్‌సభ వాయిదా

**పేపర్ లీకుల బిల్లుపై నేడు చర్చ**

న్యూఢిల్లీ: విపక్షాల ఆందోళనల నడుమ లోక్‌సభ మంగళవారానికి వాయిదా పడింది. పేపర్ లీకులకు పాల్పడే వారికి కఠిన శిక్షలు విధించేలా 2024 నాటి ప్రవేశ పరీక్షల (అక్రమ పద్ధతుల నివారణ) చట్ట సవరణ బిల్లు ఇవాళ లోక్‌సభ ముందుకు వచ్చినా.. బిల్లుపై చర్చించడం సాధ్యం కాలేదు. ఓ వైపు విపక్షాల ఆందోళనలు కొనసాగుతుండగానే.. కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ సోమవారం ఉదయం ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు. అనంతరం లోక్‌సభ మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడింది.

తిరిగి సభ ప్రారంభమైన వెంటనే.. ప్రతిపక్ష సభ్యులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సభను అడ్డుకున్నారు. దీంతో మరోసారి స్పీకర్ ఓం బిర్లా సభను మధ్యాహ్నం 5 గంటలకు వాయిదా వేశారు. ఆ తర్వాత కూడా చర్చ చేపట్టకుండా విపక్షాలు అడ్డుకున్నాయి. ఈ క్రమంలో సభను నేటికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు.పేపర్ లీక్ బిల్లు (సవరణ) చర్చకు రాకుండా విపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు విమర్శించారు. ఈ బిల్లుపై సభలో మంగళవారం చర్చించి.. అనంతరం ఓటింగ్ నిర్వహించనున్నారు.

## తక్కువ ధరలకే నాణ్యమైన బియ్యం

అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గుడ్ న్యూస్ చెప్పారు. ఈ ఏడాది ఆగస్టు 1 నుంచి తక్కువ ధరకే నాణ్యమైన బియ్యాన్ని అందించనున్నట్లు తెలిపారు. ఏపీ పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో తక్కువ ధరకే బియ్యం అమ్మకాలు జరగనున్నట్లు పవన్ పేర్కొన్నారు. బీపీటీ సూపర్ ÷న్ బియ్యం కేజీ రూ.52, పచ్చి బియ్యం కేజీ రూ.50కి అందజేయడంతో సామాన్యులకు ఊరట లభించనుందని తెలిపారు. ఏపీ ప్రజలకు అండగా ఉండేందుకే కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు డిప్యూటీ సీఎంవో కార్యాలయం ఎక్స్ వేదికగా పోస్టు పెట్టింది. 'కూటమి ప్రభుత్వం సామాన్యుడికి అండగా నిలుస్తుందని చాటి చెప్పేలా ఏపీ పౌర సరఫరాల శాఖ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నా. బహిరంగ మార్కెట్‌లో పెరుగుతున్న బియ్యం ధరల నుంచి సామాన్యులకు సాంత్వన చేకూర్చేలా పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో తక్కువ ధరకే బియ్యం అమ్మకాలు చేపట్టడం హర్షణీయం. ఆగస్టు 1 నుంచి ఏపీలోని 130 రైతుబజార్లు, 500 రైస్ మిల్లర్ల ప్రత్యేక కౌంటర్లలో బియ్యం అందుబాటులో ఉంచేలా ఏర్పాట్లు చేశారు. బీపీటీ సూపర్ ÷న్ బియ్యం కేజీ రూ.52కు, గ్రేడ్-1 పచ్చి బియ్యం కేజీ రూ.50కి అందించనున్నారు మంత్రి నాదెండ్ల మనోహర్. సామాన్యులపై ధరల భారం పడకుండా కూటమి ప్రభుత్వం తరఫున ఆయన ప్రత్యేకంగా చొరవ తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నా. బహిరంగ మార్కెట్ ధరలను సమీక్షించి, మిల్లర్లతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో ఉండేలా ధరలను నిర్ణయించాం.

ఉదయం న్యూస్
ఎడిటర్ : సి. శేఖర్ యం



# వర్షాభావంతో అల్లాడుతున్న రైతులకు జనసేన అండ.

**వర్కూరు గ్రామంలో రైతులను పరామర్శించిన కోడుమూరు నియోజకవర్గ జనసేన నాయకులు సంధ్యా విక్రమ్ కుమార్రైతన్నల కష్టాలను తెలుసుకుని భరోసా.. ప్రభుత్వం రైతుల పక్షాన నిలుస్తుందని హామీ.**



**ఉదయం న్యూస్ -- కోడుమూరు, జూలై 27:**

సకాలంలో వర్షాలు కురవక పంటలు ఎండిపోతుండటంతో తీవ్ర ఆందోళనలో ఉన్న రైతులను కోడుమూరు నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు సంధ్యా విక్రమ్ కుమార్ సోమవారం పరామర్శించారు. కోడుమూరు మండలం వర్కూరు గ్రామానికి చెందిన రైతు లక్ష్మన్న వ్యవసాయ పొలాన్ని సందర్శించిన ఆయన, పంటల పరిస్థితిని స్వయంగా పరిశీలించి రైతులతో మాట్లాడారు. పొలాల్లో నెలకొన్న పరిస్థితులను క్షుణ్ణంగా గమనిస్తూ, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, సాగులో ఎదురవుతున్న ఇబ్బందులు, పెట్టుబడులు, దిగుబడులపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.

ఇటీవల వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడంతో మొలకెత్తిన పంటలు ఎదుగుదల లేక ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే విత్తనాలు, ఎరువులు, మందులు, కూలీల కోసం లక్షల రూపాయలు ఖర్చు చేశామని, కానీ వర్షాభావంతో పంటలు దెబ్బతింటుండటంతో తీవ్ర ఆర్థిక నష్టాలు ఎదుర్కొంటున్నామని తెలిపారు. బోర్లు, చెరువుల్లో కూడా నీటి మట్టం తగ్గిపోవడంతో పంటలను కాపాడుకోవడం కష్టంగా మారిందని రైతులు వాపోయారు.

ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, వ్యవసాయం పూర్తిగా ప్రకృతిపైనే ఆధారపడి ఉంటుందని, వర్షాలు లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ కూటమి ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందనే నమ్మకం తమకు ఉందన్నారు. ప్రభుత్వం తమ సమస్యలను గుర్తించి తగిన చర్యలు తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.రైతుల సమస్యలను ఓపికగా విన్న సంధ్యా విక్రమ్ కుమార్ మాట్లాడుతూ, రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రైతుల కష్టసుఖాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను ప్రభుత్వం నిరంతరం సమీక్షిస్తోందని, రైతులు నష్టపోకుండా అవసరమైన చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉందన్నారు.

ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న పరిస్థితిని ప్రభుత్వం అత్యంత సానుభూతితో పరిశీలిస్తోందని, అవసరమైతే సంబంధిత అధికారుల ద్వారా క్షేత్రస్థాయిలో పంట నష్టాలను అంచనా వేసి రైతులకు తగిన సహాయం అందించే దిశగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని, ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని భరోసా కల్పించారు.ప్రకృతి వైపరీత్యాలు రైతులను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయని పేర్కొన్న ఆయన, ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో రైతులు ధైర్యంగా ఉండాలని సూచించారు. పంటలను కాపాడుకునేందుకు వ్యవసాయ శాఖ అధికారులు సూచించే శాస్త్రీయ సలహాలను పాటించాలని, అవసరమైన చోట ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని రైతులకు సూచించారు.

వ్యవసాయం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని, రైతు బాగుంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని సంధ్యా విక్రమ్ కుమార్ అన్నారు. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వారికి అవసరమైన సహాయం అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రైతుల సంక్షేమానికి జనసేన పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, ప్రతి రైతు సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా రైతులతో కలిసి పొలాల్లో తిరుగుతూ పంటల పరిస్థితిని పరిశీలించిన సంధ్యా విక్రమ్ కుమార్, వర్షాలు కురిసి రైతుల కష్టాలు తొలగిపోవాలని ఆకాంక్షించారు. గ్రామంలో పలువురు రైతులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకోవడంతో పాటు, భవిష్యత్తులో కూడా రైతులకు అందుబాటులో ఉంటానని తెలిపారు.ఈ కార్యక్రమంలో వర్కూరు జనసేన నాయకులు నాగరాజు, అశోక్, లక్ష్మన్న, కోడుమూరు సీనియర్ జనసేన నాయకులు రాముడు, బాలు గౌడ్, చనగండ్ల మిన్నెల్లా, స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రైతుల సమస్యలపై ప్రభుత్వానికి నివేదిక అందించి, అవసరమైన చర్యలు చేపట్టేలా కృషి చేయాలని నాయకులు ఈ సందర్భంగా నిర్ణయించారు.

# బద్వేల్ లోఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం

**బద్వేలు టిడిపి ఇన్చార్జ్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికి తెలుగుదేశం**

**బద్వేలు ఉదయం ప్రతినిధి**



కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా అధిష్టానం ఆదేశాల మేరకు బద్వేల్ టిడిపి ఇన్చార్జి మంచూరి సూర్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికి టిడిపి కార్యక్రమం

ఐదవ వార్డు లోని ఎగువ బ్రాహ్మణ వీధి, దిగువ బ్రాహ్మణ వీధి, దూల్లవీధి లలో పర్యటించారు. బద్వేల్ టిడిపి సీనియర్ నాయకులు మాజీ మున్సిపాలిటీ అధ్యక్షులు డాక్టర్ కొంకుల రాంబాబు, కొంకుల రామకృష్ణ, శ్రీరాములు, రమణయ్య, రవికుమార్ గ్రామంలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో టిడిపి, బిజెపి, జనసేన నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

రెండేళ్ల కూటమిపాలన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల భాగంగా సోమవారం బద్వేల్ టిడిపి ఇన్చార్జ్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి 17 అవార్డు శ్రీకృష్ణదేవరాయ నగర్ లో పర్యటించారు, వారికి వార్డులో అడుగడుగున ప్రజలు బ్రహ్మరథం పలుకుతూ కోదండ రామాలయంలో పూర్ణకుంభంతో స్వాగతం పలికి శాలువాలు గజమాలతో పలువురు ఘనంగా సత్కరించారు అనంతరం వార్డులో పర్యటించిన సూర్యనారాయణ రెడ్డి ఇంటింటికి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అన్న విషయంపై పలువురిని అడిగి తెలుసుకున్నారు, ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం కృష్ణ, డాక్టర్ ఓబులాపురం రాజశేఖర్, చెరుకూరి రవికుమార్, చిన్నపల్లె సుబ్బారెడ్డి,ఆరవ శ్రీనివాసుల్ రెడ్డి, 17వ వార్డు టిడిపి నాయకులు బసవి శ్రీనివాసులు, నరసయ్య గాజుల నరసింహులు (బాబు) జహంగీర్ భాష షేక్, మహబూబ్ బాషా, యాదవ సంఘం అధ్యక్షులు బుర్రి రాజా యాదవ్, మాచుపల్లి కృష్ణారెడ్డి కొలవలి వేణుగోపాల్, వడ్లపూడి నాగభూషణం లకిడి విజయభాస్కర్ షరీఫ్ ఆవుల నరసయ్య బ్రదర్స్,బుట్టి నరసింహారెడ్డి, మున్సిపాలిటీ వాటర్ సెక్షన్ విభాగం సూపర్వైజర్ ఆవులేటి బాబి, మామిడి శేషారెడ్డి,వెంకటేష్ మరియు పలువురు నాయకులు పాల్గొన్నారు

# పిఆర్సీ పై ముఖ్యమంత్రి స్పందించాలి.

**-యుటిఎఫ్ మధ్యంతర కౌన్సిల్ డిమాండ్**

**బద్వేలు ఉదయం ప్రతినిధి**




ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి చొరవ చూపాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు లు డిమాండ్ చేశారు.

కడప యుటిఎఫ్ భవన్ నందు జరిగిన ఆ సంఘ జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఒకవైపు ముఖ్యమంత్రి చెబుతూనే మరోవైపు సమస్యలు పరిష్కరించడంలో సాచివేత ధోరణి ప్రదర్శించడం సబబు కాదన్నారు. ఇటీవల మంత్రులతో జరిగిన చర్చల్లో పురోగతి కనిపించడం లేదని, ముఖ్యమంత్రి స్వయంగా ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలతో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని వారు కోరారు. పిఆర్సీ కమిటీ వేయడంతో, పాటు 29% మధ్యంతర భృతి, పెండింగ్లో ఉన్న ఐదు డిఏల చెల్లింపు, సంపాదిత సెలవుల మంజూరు తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకుంటుందని వారు తెలిపారు. విద్యా రంగ, ఉపాధ్యాయుల పలు సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయన్నారు. 2025 సంవత్సరములో బదిలీ కాబడిన కొందరు ఉపాధ్యాయులు రిలీవర్ లేని కారణంగా పాత పాఠశాలలోనే కొనసాగుతున్నారని, వారిని రిలీవ్ చేసి వారు కోరుకున్న స్థానాలకు పంపాలన్నారు. జిల్లాల పునర్విభజన నేపథ్యంలో నాన్ లోకల్ కేటగిరీలో సెలెక్ట్ అయి సొంత జిల్లాలోకి వెళ్లాలనుకున్న వారికి అంతర్ జిల్లా సాధారణ బదిలీలు నిర్వహించి సొంత జిల్లాలకు వెళ్లే అవకాశం కల్పించాలని కోరారు. 2010కి ముందు నియమితులైన ఉపాధ్యాయులను టెట్ పరీక్ష నుండి మినహాయింపు ఇవ్వాలని, అందుకు రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని కేంద్ర ప్రభుత్వంతో చర్చించి విద్యా హక్కు చట్టం 23 (1) కి సవరణ చేయాలన్నారు. చట్ట సవరణ చేసే వరకు ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ పరీక్షలను ఆఫ్ లైన్ విధానంలో నిర్వహించాలని కోరారు. గత ఏడాది ఉన్నత పాఠశాలలుగా ఉన్నతీకరించబడిన పాఠశాలలకు పలుచోట్ల తగినంత స్థలము లేక, తరగతి గదులు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అలాంటి పాఠశాలలకు తగినంత స్థలము ఏర్పాటు చేయడంతో పాటు, అదనపు తరగతి గదుల నిర్మాణము చేపట్టాలన్నారు. సమగ్ర శిక్ష, కస్తూర్బా లలో కాంట్రాక్టు ఉద్యోగులుగా పనిచేస్తున్న ఉపాధ్యాయినీలు, సిఆర్ఎంటి, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లకు మరియు ఇతర సిబ్బందికి మినిమం టైం స్కేల్ అమలు చేయాలని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడంతో పాటు దశలవారీగా వారిని రెగ్యులర్ చేయాలని కోరారు. సుదీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న మెడికల్ రీయంబర్స్మెంట్ బిల్లులను త్వరిత గతిన మంజూరు చేసి, నగదు చెల్లింపులకు చర్యలు తీసుకోవాలని కోరారు. నాలుగు సంవత్సరాలుగా చెల్లింపులకు నోచుకోక పెండింగ్లో ఉన్న సరెండర్ లీవ్ బిల్లులను చెల్లించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. పాఠశాల గ్రాంట్లను గత సంవత్సరం 50 శాతం మాత్రమే విడుదల చేశారని, ఈ సంవత్సరమైనా పూర్తిస్థాయిలో పాఠశాల అభివృద్ధి నిధులను మంజూరు చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. మనబడి మన భవిష్యత్తు (నాడు-నేడు) లో భాగంగా గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా మిగిలిపోయిన తరగతి గదులను పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొని రావాలన్నారు.కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు ఎన్.నాగార్జున రెడ్డి, సహాధ్యక్షులు వై.రవికుమార్, డి.సుజాత రాణి, ట్రెజరర్ కె.నరసింహారావు, జిల్లా కార్యదర్శులు ఎ.శ్రీనివాసులు, సి.వి.రమణ, ఎస్.ఏజాస్ అహ్మద్, జె.వి.సుబ్బారెడ్డి, డి.సుబ్బారావు, జి.గోపీనాథ్, ఎన్.కంబగిరి, కె.మురళీకృష్ణ, ఎ.డి.దేవదత్తం, కె.సుధాకర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డి.కృష్ణారెడ్డి ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎం.ప్రభాకర్ సిపిఎస్ జిల్లా కన్వీనర్ ఎన్.పవన్ కుమార్, అన్ని మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు

# నీట్ లీకేజీపై విద్యార్థుల పోరాటమే విజయం: కవిత

**హైదరాబాద్ ప్రతినిధి, ఉదయం న్యూస్**



నీట్ లీకేజీపై 36 రోజుల పాటు విద్యార్థులు చేసిన పోరాటం వల్లే కేంద్ర ప్రభుత్వం దిగివచ్చిందని టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. విద్యార్థుల విజయాన్ని సీఎం రేవంత్ తన ఖాతాలో వేసుకోవడం సరికాదని ఒక ప్రకటనలో విమర్శించారు. కేంద్రమంత్రి రాజీనామాతో పాటు విద్యార్థుల డిమాండ్లకు కేంద్రం అంగీకరించడం వారి ఉద్యమ విజయమేనన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యాలను యువత ప్రశ్నిస్తారనే భయంతోనే సీఎం డ్రామాలు ఆడుతున్నారని ఆరోపించారు.

# నీట్ పేపర్ లీకేజీ మృతుల కుటుంబాలకు కోటి రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలి

**సిపిఐ నాయకులు డిమాండ్, మృతులకు నివాళులు**

**నరసరావుపేట, ఉదయం న్యూస్, జూలై 27 :**




నీట్ పేపర్ లీకేజీ కారణంగా ప్రాణాలు కోల్పోయిన విద్యార్థులకు పట్టణంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద దేశవ్యాప్త పిలుపులో భాగంగా భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో సోమవారం నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు మాట్లాడుతూ, నీట్ పేపర్ లీకేజ్ వ్యవహారంలో దేశవ్యాప్తంగా విద్యార్థులు రోడ్ల మీదకు వచ్చి ఆందోళనలు మరియు దేశ రాజధాని ఢిల్లీ నగరంలో జంతర్ మంతర్ దగ్గర లక్షలాది మంది విద్యార్థులు నరేంద్ర మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన, ఆందోళన కార్యక్రమాలు చేయడం వలన కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం మన దేశ విద్యార్థులు,యువత విజయం అని అన్నారు. ఈ విజయం బిజెపి ప్రభుత్వ అహంకారానికి పరాజయం. ప్రజాస్వామ్య పద్ధతలలో ఢిల్లీ నగరంలో విద్యార్థులు శాంతియుతంగా ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన వ్యక్తం చేస్తుంటే బిజెపి ప్రభుత్వం ఢిల్లీ పోలీసులతో విద్యార్థులపై లాఠీచార్జి చేయించడం మరియు అక్రమ కేసులు పెట్టడాన్ని సిపిఐ ఖండిస్తుంది, వ్యతిరేకిస్తుందని వారు అన్నారు. విద్యార్థులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని, విద్యార్థులకు ఢిల్లీ పోలీసులు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీక్ అవినీతి, కారణంగా ప్రాణాలు కోల్పోయిన విద్యార్థులకు ఒక్కొక్కరికి కోటి రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని, విద్యా సంస్కరణలు లో భాగంగా తీసుకొచ్చిన ఎన్ ఈ పి -2020, ఎన్ టి ఏ ని రద్దు చేయాలని, విద్యలో సంస్కరణలు తీసుకొని తెచ్చేటప్పుడు విద్యావేత్తల సలహాలు తీసుకొని రావాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. బిజెపి నేతత్వంలోని ప్రభుత్వ దుష్పరిపాలనకు వ్యతిరేకంగా పోరాటాన్ని తీవ్రతరం చేయడానికి రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్యాన్ని కాపాడడానికి మన సంకల్పాన్ని దిశగా, రాజ్యం స్ఫూర్తితో ప్రజాస్వామ్య పరిరక్షణకై మరోసారి యువత నడుం బిగించే విధంగా కార్యక్రమాలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి సత్యనారాయణ రాజు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు మహంకాళి సుబ్బారావు, ఎఐటియుసి సీనియర్ నాయకులు ఉప్పలపాటి రంగయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వైదన వెంకట్, ఏఐవైఎఫ్ నాయకులు రాజు, కొయ్యశీను, తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం కు ఘన నివాళులు

**పిడుగురాళ్లలో పాల్గొన్న కూటమి నాయకులు**

**పిడుగురాళ్ల, ఉదయం న్యూస్, జూలై 27 :**




గురజాల నియోజకవర్గం శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు ఆదేశాల మేరకు సోమవారం పిడుగురాళ్ల పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు సోమవారం డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం కు ఘన నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ నాయకులు మాట్లాడుతూ, భారతదేశాన్ని శాస్త్ర-సాంకేతిక రంగంలో దిక్సూచిగా నిలిచిన మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చరిత్రలో నిలిచిపోయారు అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, యువత, మహిళలు ఘనంగా నివాళులర్పించారు.

# గురుకుల పాఠశాల కు సహకరించండి

**కౌతాళం ఉదయం న్యూస్ :**




అఖిల భారత విద్యార్థి సమైఖ్య టూ×ూఖీఊ ఆధ్వర్యంలో కర్నూల్ జిల్లా కార్యవర్గ సభ్యులు గురుబసవరాజ్ మరియు మండల అధ్యక్షులు సాయి వర్మ మాట్లాడుతూ కౌతాళం మండల కేంద్రంలో గురుకుల హాస్టల్ ను ఏర్పాటు చేయాలని సోమవారం మంత్రాలయం నియోజకవర్గం నాయకులు రాఘవేంద్ర రెడ్డి మరియు కౌతాళం మండల అధ్యక్షులు సురేష్ నాయుడు కు వినతిపత్రం అందజేశారు.గురుకుల హాస్టల్ ను ఏర్పాటు చేయకపోతే విద్యార్థులతో కలిసి భారీ ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఏ ఐ ఎస్ ఎఫ్ డిమాండ్ చేశారు.నాయకులు స్పందిస్తూ గురుకుల హాస్టల్ ను కౌతాళం మండల కేంద్రంలో ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎ ఐ ఎస్ ఎఫ్ మండల నాయకులు గంగారాం, ఖాదర్ మరియు కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## చిన్ని చేతులతో దృఢమైన గొప్ప సంకల్పం

**తుగ్గలి రిజర్వ్ అటవీ ప్రాంతంలో సీడ్ బాల్స్ వెదజల్లిన సాధన విద్యానికేతన్ విద్యార్థులు.**

**తుగ్గలి:ఉదయం న్యూస్:**



చిన్ని చేతులతో దృఢమైన గొప్ప సంకల్పానికి సాధన విద్యానికేతన్ విద్యార్థులు గొప్ప మనస్సులతో ముందుకొచ్చారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అడవుల అభివృద్ధి కొరకు సీడ్ బాల్స్ డిస్పర్షన్ కార్యక్రమాన్ని అటవిశాఖ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహిస్తుంది.ఈ సందర్భంగా తుగ్గలి రిజర్వ్ అటవీ ప్రాంతంలో అటవీ శాఖల అధికారుల సూచనలతో సాధన విద్యానికేతన్ కరస్పాండెంట్ దండు భాస్కర్ యాదవ్ ఆధ్వర్యంలో విద్యార్థులు చిన్ని చేతులతో సీడ్ బాల్స్ డిస్ట్రిబ్యూషన్ కార్యక్రమాన్ని సోమవారం రోజున నిర్వహించారు. విద్యార్థులు గొప్ప సంకల్పంతో చేపట్టిన ఈ కార్యక్రమం అటవీ శాఖ అభివృద్ధికి బలమైన అడుగు పడిందని పలువురు తెలియజేశారు. ఈ చిన్నారులను ఆదర్శంగా తీసుకొని అడవి శాఖ అభివృద్ధికి,పచ్చదనం పెంపొందించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని పలువురు తెలియజేశారు. గొప్ప సంకల్పంతో ముందుకు వచ్చిన సాధనా విద్యానికేతన్ యాజమాన్యాన్ని,విద్యార్థులను అటవీశాఖ అధికారులు అభినందించారు.ఈ కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు,సాధనా విద్యానికేతన్ ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బీసీ కాలనీ రోడ్డు సమస్య పరిష్కారానికి గ్రామపంచాయతీ తీర్మానం

**తుగ్గలి:ఉదయం న్యూస్:**



తుగ్గలి గ్రామంలోని బీసీ కాలనీ ప్రజలు దాదాపు 30 సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న రహదారి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా కీలక ముందడుగు పడింది.తుగ్గలి నవీన్ రెడ్డి చొరవతో బీసీ కాలనీ రహదారిని డిప్యూటీ ఎంపీడీఓ శ్రీహరి, పంచాయతీ డెవలప్మెంట్ ఆఫీసర్ రామకృష్ణ లు సోమవారం రోజున పరిశీలించారు.ఈ సందర్భంగా బీసీ కాలనీ ప్రజలు రోడ్డు లేక ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన డిప్యూటీ ఎంపీడీఓ శ్రీహరి,బీసీ కాలనీ రోడ్డు నిర్మాణానికి సంబంధించి గ్రామపంచాయతీ తీర్మానం చేసి, ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బీసీ కాలనీ పెద్దలు బంగారప్ప,గోవిందు,వెంకటేష్, బ్రహ్మయ్య,ఆటో శేఖర్ పాల్గొని కాలనీవాసుల సమస్యలను వివరించారు.ఈ సందర్భంగా తుగ్గలి నవీన్ రెడ్డి మాట్లాడుతూ బీసీ కాలనీ ప్రజలకు శాశ్వత రహదారి సౌకర్యం కల్పించే వరకు ప్రజల తరఫున నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. గ్రామపంచాయతీ తీర్మానం పూర్తయ్యేలా రోడ్డు నిర్మాణ పనులు త్వరగా ప్రారంభమయ్యేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తానని ఆయన తెలియజేశారు.బీసీ కాలనీ ప్రజలు డిప్యూటీ ఎంపీడీఓ శ్రీహరి, గ్రామపంచాయతీ కార్యదర్శి రామకృష్ణకు కృతజ్ఞతలు తెలియజేస్తూ,రోడ్డు నిర్మాణ పనులు త్వరగా ప్రారంభమయ్యేలా చర్యలు చేపట్టాలని కాలనీవాసులు అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో బీసీ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# పల్లె బాటలో ఈగల్ కార్యక్రమాలు

**తుగ్గలి:ఉదయం న్యూస్:**



జిల్లా ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు కర్నూలు జిల్లా ఈగల్ సెల్ ఆధ్వర్యంలో పల్లె బాటలో ఈగల్ కార్యక్రమంలో భాగంగా జొన్నగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో జొన్నగిరి గ్రామములో సోమవారం రోజున జొన్నగిరి ఎస్సై మల్లికార్జున ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా జొన్నగిరి ఎస్ఐ మల్లికార్జున,ఈగల్ టీం సిబ్బంది మాట్లాడుతూ ఐవిఆర్ఎస్ కాల్స్లో పాజిటివ్ పర్సెప్షన్ తక్కువగా నమోదైన నేపథ్యంలో గ్రామాలకు నేరుగా వెళ్లి ప్రజల్లో అవగాహన పెంపొందించే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎన్డిపిఎస్ చట్టం,మాదక ద్రవ్యాల దుష్పరిణామాలు,ఈగల్ టోల్ ఫ్రీ నంబర్ 1972 ద్వారా గంజాయి, డ్రగ్స్కు సంబంధించిన సమాచారాన్ని అందించాలని,సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని వారు వివరించారు. అదేవిధంగా ఆపరేషన్ చైతన్యం,ఆపరేషన్ గరుడ,ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్ కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించి, ఈగల్ అధికారిక ఫేస్బుక్,ఇన్స్టాగ్రామ్, యూట్యూబ్ వంటి సోషల్ మీడియా పేజీలను ఫాలో చేసి సబ్ స్క్రైబ్ చేసుకోవాలని వారు తెలియజేశారు.

ఉదయం న్యూస్
ఎడిటర్ : సి. శేఖర్ యం



# ఎపి రాష్ట్రాన్ని చుట్టేసిన తీవ్ర దుర్భిక్షం..?

## జాతీయ బీసీ సంక్షేమ సంఘం స్టేట్ సెక్రటరీ డాక్టర్. వడ్డేపల్లి హనుమంతు

**ఆంధ్రప్రదేశ్, ఉదయం న్యూస్**

జాతీయ బీసీ సంక్షేమ సంఘం స్టేట్ సెక్రటరీ డాక్టర్. వడ్డేపల్లి హనుమంతు మాట్లాడుతూ అనావృష్టికి 90% భూభాగం,599 మండలాల్లో వర్షాభావం
240 మండలాల్లో పరిస్థితి దారుణం
కృష్ణా డెల్టాలో వరి వద్దంటున్న ప్రభుత్వం
గోదావరి ఆయకట్టుకూ కటకట...ఎపి రాష్ట్రాన్ని తీవ్ర దుర్భిక్షం చుట్టుముట్టింది. జూలై నాల్గవ వారం గడుస్తున్నా వాన చినుకు అడ్రస్ లేదు. మొత్తం అన్ని జిల్లాలూ వర్షాభావాన్ని ఎదుర్కొంటున్నాయి. ఏడు జిల్లాల్లో అత్యల్ప స్థాయి సాధారణంలో 60-99 శాతం తక్కువ వర్షం పడింది. రోజు రోజుకూ వర్షాభావం తీవ్ర రూపం దాల్చుతోంది. 'ఎల్‌నినో' వలన భవిష్యత్తులో కూడా అంతగా వర్షాలు ఉండక పోవచ్చని వాతావరణశాఖ హెచ్చరికలు రైతులను కలవరపెడుతున్నాయి..జాతీయ బీసీ సంక్షేమ సంఘం స్టేట్ సెక్రటరీ డాక్టర్. వడ్డేపల్లి హనుమంతు ఆవేదన వ్యక్తం చేశారు. ఖరీఫ్‌లో జూలై ముగుస్తున్నందున ఈ ఏడాది సీజన్ ఖాళీయేనన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఎపిలో 688 మండలాలకుగాను 599 మండలాల్లో వర్షాభావం తిష్ట వేసింది. వాటిలో 240 మండలాల్లో పరిస్థితి దారుణంగా ఉంది. మరో 359 మండలాల్లో సాధారణ వర్షపాతం కంటే తక్కువ వర్షం నమోదైంది. కేవలం 74 మండలాల్లోనే సాధారణ వర్షం పడింది. సాధారణం కంటే ఎక్కువ 15 మండలాల్లో, పడింది. నైరుతి రుతుపవన కాలం ప్రారంభ నెల జూన్‌లో 48.3 శాతం తక్కువ వర్షం నమోదైంది. అన్ని జిల్లాలూ వర్షాభావంలో మగ్గాయి. తదుపరి జూలైలోనైనా వానలు పడతాయనుకోగా వర్షాభావం ఇంకా పెరిగింది. జూలై 1 నుంచి 24 మధ్య ఏకంగా 76 శాతం లోటు వర్షం నమోదైంది. అల్పపీడనం, వాయుగుండం, ఆవర్తానాలు.. ఇవేవీ వర్షాలు కురిపించలేదు. అడపాదడపా చినుకులతోనే సరిపెట్టాయి. ఒక్క నెల్లూరు జిల్లాలోనే కొద్ది మేర వానలు పడ్డాయి. సాంకేతికంగా శుక్రవారం ఉదయం వరకు సాధారణ వర్షం పడ్డ కేటగిరీలో ఉన్న ఆ జిల్లా సాయంత్రానికొచ్చేసరికి మైనస్‌లోకి జారింది.





రోజు రోజుకూ.. జూన్ 1 నుంచి జూలై 24 మధ్య రాష్ట్రంలో సగటున సాధారణంగా 228.3 మిల్లీమీటర్ల వర్షం కురవాల్సి ఉండగా 104.6 మిమీ కురిసింది.. జాతీయ బీసీ సంక్షేమ సంఘం స్టేట్ సెక్రటరీ డాక్టర్. వడ్డేపల్లి హనుమంతు తెలిపారు. సాధారణ వర్షంలో 54.2 శాతం తక్కువ. జూలైలో ఈ పాటికి 131 మిమీ పడాల్సి ఉండగా 31.9 మిమీ పడింది. ఈ నెల మూడు వారాల్లో 76 శాతం మైనస్. పశ్చిమగోదావరి, కోనసీమ, తూర్పుగోదావరి, ప్రకాశం, అన్నమయ్య, కడప, చిత్తూరు...ఏడు జిల్లాలు అత్యల్ప వర్షం కురిసిన కేటగిరీలో ఉన్నాయి. మిగతా 21 జిల్లాలు ప్రస్తుతానికి తక్కువ వర్షం సాధారణంలో లోటు 20-59 శాతం కురిసిన జాబితాలో ఉన్నాయి. త్వరలోనే మరిన్ని జిల్లాలు అత్యల్ప వర్షపు కేటగిరీలోకి చేరే సూచనలు కనిపిస్తున్నాయి. పశ్చిమగోదావరిలో రాష్ట్రంలోనే అత్యల్పంగా 77.2 శాతం మైనస్ వర్షం కురిసింది. అత్యల్ప వర్షం పడ్డ మిగతా ఆరు జిల్లాల్లో కూడా 60-76 శాతం మేర లోటు వర్షంతో సతమతమవుతున్నాయి. ఈ నెలలో కడపలో కేవలం 5.4 మిమీ వర్షం పడింది. పొంచి ఉన్న నీటి గండం?సమీప భవిష్యత్తులో వానలు పడే సూచనలు లేనందున రిజర్వాయర్లలో ప్రస్తుతం ఉన్న నీటిని కేవలం తాగునీటి అవసరాలకేనంటున్నందున కృష్ణా డెల్టాలో వరి పంట ఈ సారి లేనట్లే.

# ఆర్‌ఓబి పనులు మరింత స్పీడప్ చేయండి: జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా

**కరీంనగర్ ప్రతినిధి, ఉదయం న్యూస్**



కరీంనగర్-చొప్పదండి ప్రధాన రహదారిపై తీగలగుట్టపల్లి వద్ద నిర్మాణంలో ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జి ఆర్‌ఓబి పనులను మరింత వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా కలెక్టర్ నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆర్‌ఓబి నిర్మాణ పనుల ప్రస్తుత పురోగతి, ఇప్పటికే పూర్తయిన పనులు, ఇంకా చేపట్టాల్సిన పనులపై ఆర్ అండ్ బి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా బ్రిడ్జి నిర్మాణంతో పాటు నాలుగు వైపులా నిర్మించాల్సిన సర్వీస్ రోడ్లు, భూసేకరణ ప్రక్రియ, డ్రైనేజీ, ఇతర అనుబంధ పనుల పురోగతిపై ఆరా తీశారు. పనులు వేగంగా సాగేందుకు అవసరమైన చర్యలను వెంటనే చేపట్టాలని అధికారులకు సూచించారు.

నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా ప్రతిరోజూ పర్యవేక్షణ నిర్వహించాలని, పనుల నాణ్యతలో రాజీ పడొద్దని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడకుండా ట్రాఫిక్ నిర్వహణకు తగిన చర్యలు తీసుకోవాలని, నిర్మాణ ప్రాంతంలో భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. సర్వీస్ రోడ్ల నిర్మాణం ఈ ప్రాజెక్టులో అత్యంత కీలకమని పేర్కొన్న కలెక్టర్, వాటి నిర్మాణానికి అవసరమైన భూసేకరణ పనులను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. ఇందుకు సంబంధించిన రెవెన్యూ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు.ఆర్‌ఓబి పూర్తయితే కరీంనగర్-చొప్పదండి మార్గంలో ట్రాఫిక్ సమస్యలు గణనీయంగా తగ్గడంతో పాటు రైల్వే గేటు వద్ద ఏర్పడే నిరీక్షణకు ముగింపు లభిస్తుందని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ పనులను ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందన్నారు. నిర్మాణ పనుల అమలులో ఎదురయ్యే సమస్యలు ఏవైనా ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించిన కలెక్టర్, పనుల పురోగతిపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఈఈ కుమారస్వామి, డీఈ కిరణ్, ఏఈ మధు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటికి కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలు...గ్రంథాలయ సంస్థ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర

## రాతన గ్రామంలో ఘనంగా ప్రారంభమైన ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం.

**తుగ్గలి:ఉదయం న్యూస్:**

అర్హత కలిగిన ప్రతి ఇంటికి కూటమి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రతి ఒక్కరికి అందాయని ఉమ్మడి జిల్లాల గ్రంథాలయ సంస్థ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర తెలియజేశారు.రాష్ట్ర ప్రభుత్వ,పత్తికొండ శాసనసభ్యులు కేఈ శ్యాంబాబు ఆదేశాల మేరకు మొదటి రోజున రాతన గ్రామంలో ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమాన్ని సోమవారం రోజున తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రారంభించారు. ముందుగా రాతన గ్రామంలోని గల నందమూరి తారక రామారావు విగ్రహానికి గజమాలను వేసి నివాళులర్పించి కార్యక్రమాన్ని టిడిపి శ్రేణులు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా తెలుగుదేశం పార్టీ ప్రజాప్రతినిధులు,నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ఏర్పడి రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంలో కూటమి ప్రభుత్వం సాధించిన అభివృద్ధి, సంక్షేమ విజయాలను వారు ప్రజలకు క్షుణ్ణంగా





వివరించారు.ఈ సందర్భంగా ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు, తల్లికి వందనం,స్త్రీ శక్తి,దీపం పథకం, అన్నదాత సుఖీభవ,అన్న క్యాంటీన్ల ప్రారంభం,పేదలకు 5 లక్షల ఇల్లు, ఎన్టీఆర్ వైద్య సేవలు, మత్స్యకారులకు సంక్షేమ నిధి వంటి వివిధ పథకాలను వారు ఇంటింటికి వెళ్లి ప్రజలకు కరపత్రాలు అందజేసి వివరించారు.అదేవిధంగా సంక్షేమ పథకాలతో పాటుగా కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో సాగునీటి ప్రాజెక్టులకు,గ్రామీణ రహదారులకు, రైతులకు సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలకు,రైతులకు రాజముద్ర తో కూడిన పాసుపుస్తకాలు,ఉచిత ఇసుక వంటి పథకాలను ప్రారంభించి అన్ని ప్రాంతాల సమాన అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని వారు తెలియజేశారు.కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో మెగా డీఎస్సీ ద్వారా టీచర్ పోస్టులు,రాష్ట్రంలో పోలీసుల ఉద్యోగాలను భర్తీ చేసిందని వారు తెలియజేశారు. అదేవిధంగా కూటమి ప్రభుత్వ సమన్వయంతో ఎన్నో కంపెనీలు రాష్ట్రానికి ధరలు వచ్చి ఉపాధి అవకాశాన్ని కల్పిస్తున్నాయని వారు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి వరలక్ష్మి,తెలుగు మహిళా మండల అధ్యక్షురాలు రాతన ఈరమ్మ,మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ బత్తిన
వెంకటరాముడు,రాతన మనోహర్ చౌదరి,కృష్ణమూర్తి చౌదరి, ఉప్పర్లపల్లె సొసైటీ చైర్మన్ అప్పా వేణు,మాజీ ఎంపీపీ కొమ్ము వెంకటేష్, గిరిగేట్ల తిమ్మయ్య,ఎర్రగుడి వెంకట స్వామి,రాతన గోవిందరెడ్డి,మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు,
ఎద్దులదొడ్డి శీను,సంఘాల కృష్ణ,మిద్దె వెంకటేశ్వర్లు యాదవ్,మాజీ ఎంపీటీసీ వల్లే వెంకటేష్, డీలర్ తిమ్మప్ప,యడవల్లి తిమ్మప్ప, చంద్రశేఖర్ యాదవ్,రాతన మైరాముడు తదితర మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పెరవలి రంగనాథ స్వామి కు వెండి కిరీటం బహుకరణ

## 1 కేజీ 338 గ్రాముల గల వెండి కిరీటం అందజేత.

**మద్దికేర:ఉదయం న్యూస్:**



మద్దికేర మండల పరిధిలోని గల పెరవలి గ్రామం నందు వెలసిన శ్రీ భూదేవి రాజ్యలక్ష్మి సమేత శ్రీ రంగనాథ స్వామికు మొక్కుబడి కింద వెండి కిరీటాన్ని సోమవారం రోజున జోలాపురం గ్రామ వాస్తవ్యులు దండిమేని నిర్మలమ్మ కుమారుడు దండిమేని నందకిషోర్ కోడలు దండిమేని ద్రాక్షవేణి మనవడు దండిమేని మానసి యాదవ్ లు స్వామివారికి వెండి కిరీటాన్ని అందజేశారు.1 కేజీ 338 గ్రాముల గల వెండి కిరీటాన్ని ఆలయ అర్చకులు కోమండూరి రంగనాథ ఆచార్యులు, మధు స్వామి,పాలకమండలి చైర్మన్ పారా రవి,పాలక మండల సభ్యులకు దండిమేని వారి కుటుంబ సభ్యులు కిరీటాన్ని అందజేశారు.ఈ సందర్భంగా దాతలకు పాలక మండల సభ్యులు శ్రీ రంగనాథ స్వామి దేవాలయం నందు ప్రత్యేక పూజలను నిర్వహించి తీర్థ ప్రసాదాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం గారి 11వ వర్ధంతి

**ఉదయం న్యూస్ ఆళ్లగడ్డ**

భారతరత్న మాజీ రాష్ట్రపతి మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం గారి 11వ వర్ధంతిని పురస్కరించుకొని అపుస్మా ఆళ్లగడ్డ నియోజవర్గం యూనిట్ ఆధ్వర్యంలో అపుస్మా ఆళ్లగడ్డ నియోజకవర్గం యూనిట్ అధ్యక్షులు టి అమీర్ బాషా, కోశాధికారి వై ఎన్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ముఖ్య అతిథిగా ఆళ్లగడ్డ టౌన్ సిఐ గారు నాగరాజు రావు సార్ గారు విచ్చేసి ఆళ్లగడ్డ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం గారి విగ్రహానికి ఆళ్లగడ్డ టౌన్ లోని ఐ డి ఎస్ హైస్కూల్ ఉపాధ్యాయ బృందం విద్యార్థి బృందం జాతీయ పతాకాలతో పూలమాల అర్పించి భారత్ మాతాకీ జై ఏపీజే అబ్దుల్ కలాం అమర్ రహే వందేమాతరం జై భారత్ అంటూ నినాదాలతో ఘనమైన నివాళి అర్పించి దేశభక్తిలో స్ఫూర్తిగా నిలిచారు ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన టౌన్ సిఐ నాగరాజు రావు సార్ గారు మాట్లాడుతూ భారతదేశం గర్వించదగ్గ గొప్ప శాస్త్రవేత్త, ప్రజల రాష్ట్రపతిగా మానవతావాదిగా యువత భవిత కోసం తపించిన మహాతపస్విగా భారతీయుల గుండెల్లో చిరస్మరణీయుడుగా నిలిచిపోయాడు పేపర్ బాయ్ నుండి భారత రాష్ట్రపతిగా మిస్సైల్ మెన్ గా ఏపీజే అబ్దుల్ కలాం గారి జీవితం విద్యార్థులకు యువతకు ఆదర్శం



అన్నారు నిజాయితీకి నిరాడంబరతకు క్రమశిక్షణకు నిలువెత్తు రూపం ఏపీజే అబ్దుల్ కలాం గారు ఈ సందర్భంగా అపుస్మ ఆళ్లగడ్డ నియోజకవర్గం యూనిట్ అధ్యక్షులు టి అమీర్ బాషా మాట్లాడుతూ ఏపీజే అబ్దుల్ కలాం గారు శాస్త్రవేత్తగా రచయితగా బోధకుడిగా రాష్ట్రపతిగా భారత ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పిన గొప్ప మహనీయుడు కలలు కనండి వాటిని సాకారం చేసుకోండి సందేశంతో విద్యార్థులను యువతను ప్రేరణ దాతగా కలలు ఆలోచనలుగా మారుతాయి ఆలోచనలు చర్యలుగా
మారుతాయి చర్యలు మీ భవిష్యత్తును నిర్ణయిస్తాయని తెలిపి దేశానికి ఉపయోగపడే జీవనం మన వల్ల సమాజానికి కొంత మేలు జరిగే లక్ష్యం అంకిత భావం ఉండాలని బోధించారు వారు 2015లో జూలై 27వ తేదీన మేఘాలయలోని షిల్లాంగ్ లో ఐఐఎంలో విద్యార్థులకు ప్రసంగిస్తూ గుండెపోటుతో తుది శ్వా విడిచారు వారు భారతీయుడిగా జీవించిన విధానం భావితరాలకు ఆదర్శం

# భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ కు నివాళులు అర్పించిన డాక్టర్ గోపిరెడ్డి

**నరసరావుపేట, ఉదయం న్యూస్, జూలై 27 :**



నరసరావుపేట పట్టణంలోని పల్నాడు రోడ్ నందు భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ 11వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి ఘన నివాళులు అర్పించారు. నివాళులర్పించిన వారిలో వైఎస్ఆర్సిపి పల్నాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, నరసరావుపేట మాజీ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, తోపాటు షేక్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ షేక్ ఖాజావలి, పట్టణ అధ్యక్షులు కరీముల్లా, స్వామి మాస్టారు, మరియు మైనార్టీలు, వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

# కేజీబీవీ పాఠశాలలో అవగాహన కార్యక్రమం.

**ఉదయం న్యూస్ -- సి. బెలగల్, జూలై 27:**



జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విద్యార్థుల్లో చట్టాలపై అవగాహన పెంపొందించడం, మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణ, బాల్య వివాహాల నిర్మూలన వంటి అంశాలపై చైతన్యం కల్పించే ఉద్దేశంతో సి. బెలగల్ ఎస్ ఐ . వేణుగోపాల రాజుఆధ్వర్యంలో సోమవారం సి. బెలగల్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సి. బెలగల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొని విద్యార్థినులకు పలు ముఖ్యమైన అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు.
కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాలు సమాజంపై చూపే ప్రతికూల ప్రభావాలు, బాలికల విద్యాభ్యాసానికి వాటి వల్ల కలిగే నష్టం, ఆరోగ్య సమస్యలు, చట్టపరమైన చర్యల గురించి విద్యార్థినులకు వివరించారు. బాల్య వివాహాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు సమాచారం అందించాలని సూచించారు. బాలికల హక్కులను పరిరక్షించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న చట్టాలు, రక్షణ చర్యలను కూడా వివరించారు.
అదేవిధంగా మహిళలపై వేధింపులు, ఈవ్‌టీజింగ్, లైంగిక వేధింపులు, మహిళలపై జరుగుతున్న నేరాల గురించి అవగాహన కల్పిస్తూ, ఇటువంటి సంఘటనలు ఎదురైనప్పుడు భయపడకుండా వెంటనే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. నేరాలను దాచిపెట్టకుండా ధైర్యంగా ఫిర్యాదు చేస్తేనే వాటిని సమర్థవంతంగా అరికట్టడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.
నేటి డిజిటల్ యుగంలో పెరుగుతున్న సైబర్ నేరాలు మరియు ఆన్‌లైన్ మోసాల గురించి విద్యార్థినులకు విపులంగా వివరించారు. సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని, అపరిచిత వ్యక్తులతో వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవద్దని సూచించారు. తెలియని లింకులు ఓపెన్ చేయడం, అనుమానాస్పద యాప్‌లను డౌన్‌లోడ్ చేయడం, నకిలీ వెబ్‌సైట్లలో బ్యాంకింగ్ వివరాలు నమోదు చేయడం వంటి చర్యల వల్ల మోసాలకు గురయ్యే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. సైబర్ నేరాలకు గురైన వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్కు సమాచారం అందించి ఫిర్యాదు చేయాలని వివరించారు.అలాగే ×ఎ=ూ కాల్స్, నకిలీ బ్యాంకు ప్రతినిధుల పేరుతో వచ్చే ఫోన్ కాల్స్, బహుమతులు వచ్చాయని చెప్పే మోసపూరిత సందేశాలు, ఉద్యోగాల పేరుతో మోసాలు వంటి వాటిపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ౫ూలు, ౹ూవీ పిన్ నంబర్లు, బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌వర్డ్‌లు వంటి గోప్యమైన సమాచారాన్ని ఇతరులకు వెల్లడించవద్దని స్పష్టం చేశారు.
ఈ సందర్భంగా మాదకద్రవ్యాల వినియోగం వల్ల విద్యార్థుల భవిష్యత్తు నాశనం అవుతుందని, ఆరోగ్యపరంగా, మానసికంగా, సామాజికంగా తీవ్ర దుష్పరిణామాలు ఎదురవుతాయని వివరించారు. మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని, ఎక్కడైనా మాదకద్రవ్యాల అక్రమ విక్రయాలు లేదా వినియోగం గురించి సమాచారం తెలిసినట్లయితే వెంటనే 1972 హెల్ప్‌లైన్కు లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు.రోడ్డు భద్రతపై కూడా విద్యార్థినులకు అవగాహన కల్పించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల జరిగే ప్రమాదాలు, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించడం, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం, రోడ్డు దాటేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవడం వంటి అంశాలను వివరించారు.

# విద్యార్థుల పోరాట ఫలితమే కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా :ూఖీ×,

**ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో సంబరాలు**

**ఉదయం న్యూస్ ఆళ్లగడ్డ**




ధర్మేంద్ర ప్రధాన్‌ను రాజీనామా చేయించే వరకు నిరంతరంగా పోరాడిన ప్రతి విద్యార్థికి, యువతకు, ప్రజాస్వామ్య శక్తులకు జేజేలు తెలియజేసీ ఆళ్లగడ్డ పట్టణంలో కేక్ కట్ చేసి, చాక్లెట్ పంచి సంబరాలు చేసుకున్న ూఖీ× ఆళ్లగడ్డ మండల్ ఇంచార్జ్ అధ్యక్షుడు మున్నా మరియు ఎస్ఎఫ్ఐ నాయకులు అనంతరం వారు మాట్లాడుతూ....ఇది విద్యార్థుల ఐక్యత సాధించిన చారిత్రాత్మక విజయం. సంఘటిత విద్యార్థి శక్తి ముందు ఏ పాలకుడూ గొప్పవాడు కాదని ఈ పోరాటం మరోసారి నిరూపించింది.
గత రెండు నెలలుగా కొనసాగిన విద్యార్థుల ఉద్యమం నరేంద్ర మోదీ ప్రభుత్వ అహంకార కోటను కదిలించింది. ఈ పోరాటంలో విద్యార్థులతో కలిసి నిలిచిన అన్ని ప్రజాస్వామ్య, ప్రగతిశీల విద్యార్థి, యువజన, ప్రజా సంఘాలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తోంది. ముఖ్యంగా దేశవ్యాప్తంగా విద్యార్థి ఆగ్రహాన్ని శాంతియుతమైన, శక్తివంతమైన ప్రజాస్వామ్య ఉద్యమంగా మలచడంలో కీలక పాత్ర పోషించిన జబ్రీతో పాటు అన్ని ప్రగతిశీల విద్యార్థి సంఘాల నాయకత్వాన్ని అభినందిస్తోంది.
ఈ విజయం కేవలం ఒక మంత్రి రాజీనామాతో ముగిసే విజయం కాదు. భారత విద్యా వ్యవస్థలో సమూల సంస్కరణల కోసం కొనసాగుతున్న పోరాటంలో ఇది ఒక ముఖ్యమైన మైలురాయి.
భారత విద్యారంగాన్ని పట్టిపీడిస్తున్న వ్యవస్థాగత సంక్షోభం పూర్తిగా తొలగే వరకు మా పోరాటం వివిధ రూపాల్లో కొనసాగుతుంది. 20 మందికి పైగా విద్యార్థుల ప్రాణాలు బలిగొన్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (చీూూ)ను వెంటనే రద్దు చేయాలి. విద్యార్థి వ్యతిరేక విధానాలకు చట్టబద్ధత కల్పిస్తున్న జాతీయ విద్యా విధానం (చీజూూ)-2020ను ఉపసంహరించుకోవాలి. పరీక్షల అక్రమాలు, వైఫల్యాల వల్ల నష్టపోయిన విద్యార్థులకు, వారి కుటుంబాలకు సంపూర్ణ న్యాయం జరగాలి. దేశంలోని ప్రతి విద్యార్థికి సమానమైన, న్యాయబద్ధమైన, సమగ్ర విద్య అందే వరకు మా ప్రతిఘటన ఆగదు.
చీజుజు పరీక్షల్లో జరిగిన అక్రమాలకు వ్యతిరేకంగా మొదటిసారిగా ఉద్యమాన్ని ప్రారంభించిన సంఘాల్లో ూఖీ× ఒకటి. గత ఐదేళ్లకు పైగా చీజూూ-2020కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరంతర పోరాటం చేస్తోంది. గత రెండు నెలలుగా చీజుజు ప్రశ్నాపత్రం లీక్, చీూూ వైఫల్యాలు, శాంతియుత నిరసనలపై ప్రభుత్వ నిర్బంధ చర్యలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా విద్యార్థులను సమీకరిస్తూ ఉద్యమాన్ని ముందుండి నడిపించింది.
రాబోయే రోజుల్లో దేశవ్యాప్తంగా విద్యార్థులను మరింత విస్తృతంగా సమీకరించి, మా డిమాండ్ల సాధన కోసం మరింత ఉధృతమైన ఉద్యమాలను చేపడతాం. ఈ పోరాటంలో తరాల మధ్య ఉన్న అంతరాలను చెరిపేస్తూ విద్యార్థులు, యువత, ప్రజలు చూపిన ఐక్యత, అంకితభావం, ధైర్యసాహసాలకు ూఖీ× హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తోంది.
"ఇప్పుడే పోరాటం మొదలైంది...
ముందుంది మరింత పెద్ద పోరాటం!" ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఆళ్లగడ్డ ఇన్చార్జి అధ్యక్షుడు మున్నా, మరియు ఎస్ఎఫ్ఐ నాయకులు సంతోష్, నరసింహ, ప్రేమ్, చరణ్, భార్గవ్ విద్యార్థులు పాల్గొన్నారు.

# మోదీ నాయకత్వాన్ని అస్థిరపరిచే ప్రయత్నం: డీకే అరుణ

హైదరాబాద్,

ఆప్ పార్టీ కోసం పని చేసే ఓ వ్యక్తి.. మోదీ నాయకత్వాన్ని అస్థిరపరిచే ప్రయత్నం చేశారని భాజపా ఎంపీ డీకే అరుణ ఆరోపించారు. నీట్ పేపరు లీక్ కాగానే వెంటనే దాన్ని రద్దు చేసి, తక్కువ సమయంలోనే తిరిగి పరీక్షను నిర్వహించి పొరపాటును సరిదిద్దుకున్నామని వెల్లడించారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడారు. "భారాస ప్రభుత్వ హయాంలో గ్రూప్ పరీక్ష పేపర్ లీక్, ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంలో పదో తరగతి పేపర్ లీక్ అయ్యాయి. అప్పుడు ఎవరైనా రాజీనామా చేశారా? మోదీని, దేశ కీర్తిని అపహాస్యం చేసేందుకే కొందరు ప్రయత్నం చేస్తున్నారు. రాహుల్‌గాంధీ ప్రతిపక్ష నేతగా ఏ ఒక్క విషయంపైనా పార్లమెంట్‌లో చర్చించడానికి సిద్ధంగా లేరు. కాని, నల్లదుస్తులు ధరించి రోడ్డుపై ధర్నాలు చేస్తున్నారు" అని విమర్శించారు.



# విపత్కరం.. చైనాలో తుపాను 10 మంది మృతి

బీజింగ్: చైనాలో నౌల్ తుపాను బీభత్సం సృష్టిస్తోంది. భారీ వర్షాల కారణంగా సంభవించిన వరదల ధాటికి గన్సు సీనిక్ ప్రాంతంలో 10 మంది మృతి చెందినట్లు ప్రభుత్వ మీడియా పేర్కొంది. చైనాలో ఇటీవల సంభవించిన బావి తుపాను కన్నా ఇది ఎంతో శక్తిమంతమైందని, దీని కారణంగా గంటకు 162 కి.మీ. వేగంతో గాలులు వీస్తున్నాయని వివరించింది. తుపాను కారణంగా గ్వాంగ్ డాంగ్ ప్రాంతంలో హైస్పీడ్ రైలు సేవలు, విమాన సర్వీసులు నిలిచిపోయాయి. దీంతో జనజీవనం స్తంభించింది.

# ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి ఎక్కడ?

హైదరాబాద్,

జాతీయ పోలీసు అకాడమీలో తనపై వేధింపులకు పాల్పడ్డాడని మహిళా ట్రైనీ ఐపీఎస్ ఇచ్చిన ఫిర్యాదులో ఉదయ్ కృష్ణారెడ్డిపై ఈ నెల 18న అత్తాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణలో భాగంగా నిందితుడు పేర్కొన్న రెండు చిరునామాల్లోనూ నోటీసులు ఇచ్చేందుకు వెళ్లగా పోలీసులకు అతడి ఆచూకీ లభించలేదు. సెల్‌ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ అని వస్తున్నట్లు పోలీసులు ఆదివారం తెలిపారు.



# ఏఐ సహాయంతో నాసా శనిగ్రహంపై రీసెర్చ్!

వెబ్ డెస్క్

అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా (చీూూూ) అంతరిక్ష పరిశోధనల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నట్టు సమాచారం. శనిగ్రహం, దాని చుట్టూ ఉన్న వలయాల మీద పరిశోధనల కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తోంది.

**నాసా పరిశోధనలివే**

శనిగ్రహం చుట్టూ ఉన్న ప్రసిద్ధ వలయాల నుంచి కణాలను సేకరించేందుకు నాసా -ఆధారిత 'ప్రాక్సిస్' రోబోటిక్ స్పేస్‌క్రాఫ్ట్ ప్రయోగాన్ని సిద్ధం చేస్తోంది. శనిగ్రహపు వలయాల నుంచి నమూనాలను సేకరించడం అంతరిక్ష చరిత్రలోనే ఇది తొలిసారి కానుంది. భూమి నుంచి నియంత్రణ సంకేతాలు వెళ్లడానికి సమయం పడుతుంది కాబట్టి, రోవర్ లేదా రోబోలు అక్కడికక్కడే స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకుని అంతరిక్ష వ్యర్థాల నుంచి సురక్షితంగా నమూనాలను సేకరించడానికి ఏఐ అల్గారిథమ్‌లు సహాయపడతాయి. అలాగే శనిగ్రహం చుట్టూ తిరిగే పదుల సంఖ్యలోని చిన్న చిన్న ఉపగ్రహాలను, ఆస్టరాయిడ్లను గుర్తించడంలో నాసా ఏఐ టెక్నాలజీని ఉపయోగిస్తోంది. టెలిస్కోప్ ద్వారా లభించే భారీ స్థాయి డేటాను విశ్లేషించి, అతి చిన్న ఖగోళ వస్తువులను వేగంగా గుర్తించడంలో ఏఐ ఇప్పటికే విజయం సాధించింది.

**'టైటాన్' మీద జీవజాలం!**

మరోవైపు శనిగ్రహం యొక్క అతిపెద్ద ఉపగ్రహమైన 'టైటాన్'పై జీవజాలం ఉనికిని అన్వేషించడానికి నాసా డ్రాగన్‌ఫ్లై హెలికాప్టర్ మిషన్‌ను రూపొందిస్తోంది. టైటాన్ ఉపరితలంపై ఏఐ సహాయంతోనే ఈ రోవర్ ప్రయాణిస్తూ, అక్కడి వాతావరణం, రసాయన మూలకాల డేటాను విశ్లేషిస్తుంది. శనిగ్రహంతో పాటు యురేనస్, నెప్ట్యూన్ గ్రహాల చుట్టూ ఉండే వలయాలు ఎలా ఏర్పడ్డాయో అర్థం చేసుకోవడానికి ఏఐ సిమ్యులేషన్స్ నాసా శాస్త్రవేత్తలకు ఎంతో తోడ్పడుతున్నాయని అంతర్జాతీయ కథనాలు వెలువడుతున్నాయి.

# 8 నెలల తర్వాత భూమికి తిరిగొచ్చిన వ్యోమగాములు

మాస్కో: భూ కక్ష్యలోని అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో (ఐఎస్‌ఎస్) 8 నెలలపాటు గడిపిన అమెరికా, రష్యా వ్యోమగాములు ఆదివారం సురక్షితంగా భూమికి చేరుకున్నారు. నాసాకు చెందిన క్రిస్ విలియమ్స్, రష్యా వ్యోమగాములు సెర్గీ కుద్ స్వెర్ట్‌కోవ్, సెర్గీ మికాయెవ్‌లు.. సోయుజ్ ఎంఎస్-28 వ్యోమనౌక ద్వారా కజకిస్థాన్‌లోని గడ్డి నేలల్లో దిగారు. చివర్లో పారాచూట్లు విచ్చుకుని స్పేస్‌క్రాఫ్ట్‌ను సాఫీగా కిందకి దిగేలా చేశాయి. క్రిస్, మికాయెవ్‌లకు ఇది మొదటి అంతరిక్ష యాత్ర కాగా.. సెర్గీ కుద్ స్వెర్ట్‌కోవ్‌కు రెండో యాత్ర.



# రైతులకు గిట్టుబాటు ధర అందేలా చూడాలి

## మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాల టౌన్



రైతులందరికీ గిట్టుబాటు ధర అందేలా చూడాలని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు పేర్కొన్నారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో నూతన మంచిర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లు ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు అందేలా, మార్కెట్ యార్డుల్లో మౌలిక సదుపాయాలను మరింత మెరుగుపరిచే దిశగా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. నూతన మార్కెట్ కమిటీ పాలకవర్గం రైతుల విశ్వాసాన్ని నిలబెట్టేలా పారదర్శకంగా పనిచేసి మార్కెట్ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ మాట్లాడుతూ.. రైతులకు ఎల్లప్పుడూ అండగా నిలిచి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నూతన పాలకవర్గానికి సూచించారు. మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎమ్మెల్యే దంపతులను గజమాలతో, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతం, మార్కెట్ కమిటీ జిల్లా అధికారులు, టీపీసీసీ ఉపాధ్యక్షులు చిట్ల సత్యనారాయణ, మంచిర్యాల జిల్లా ఆర్టీఏ సభ్యుడు అంకతి శ్రీనివాస్, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య-మహేష్, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, కార్పొరేటర్ తూముల నరేష్, మంచిర్యాల జిల్లా ఆర్‌జీపీఆర్‌ఎస్ అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి, ఆత్మ కమిటీ చైర్మన్ సింగితి మురళి, లక్షెట్టిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ అక్కల వెంకటేశ్వర్లు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, జిల్లా ఓబీసీ అధ్యక్షుడు ఒడ్డే రాజమౌళి, జిల్లా నాయకులు నాగభూషణం, మంచిర్యాల జిల్లా మహిళా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు పెంట రజిత, పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గజ్జల హేమలత, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కాలేయ వ్యాధులపై ఆఖరి హెచ్చరిక పుస్తకాల ఆవిష్కరణ

హైదరాబాద్,




కాలేయ వ్యాధుల నివారణ, ముందస్తు గుర్తింపుపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించే లక్ష్యంతో ప్రముఖ హెపటాలజిస్ట్ డా. కె.ఎస్. సోమశేఖరరావు రచించిన లాస్ట్ వార్నింగ్(ఇంగ్లీష్), ఆఖరి హెచ్చరిక (తెలుగు) పుస్తకాలను హైటెక్ సిటీలోని యశోద హాస్పిటల్స్‌లో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్, ఎంపీ శబరి బైరెడ్డి, యశోద హాస్పిటల్స్ ఎండీ డా. జి.ఎస్. రావుతో కలిసి ఈ పుస్తకాలను ఆవిష్కరించారు. దేశంలో ఫ్యాటీ లివర్, వైరల్ హెపటైటిస్, మద్యపాన సంబంధిత కాలేయ సమస్యలు, లివర్ సిరోసిస్ వంటి వ్యాధులు ఆందోళనకర రీతిలో పెరుగుతున్నాయని జస్టిస్ జాస్తి చలమేశ్వర్ పేర్కొన్నారు. సరైన అవగాహన, ఆరోగ్యకరమైన జీవనశైలి, ప్రారంభ దశలోనే వ్యాధిని గుర్తించడం ద్వారా వీటిని అరికట్టవచ్చని తెలిపారు. వైద్య పరిజ్ఞానం లేని సాధారణ ప్రజలు కూడా సులభంగా అర్థం చేసుకునేలా, ప్రతి అధ్యాయాన్ని నిజ జీవిత కేస్ స్టడీతో రచయిత రూపొందించడం అభినందనీయమన్నారు.

అవగాహన కల్పించడమే అత్యుత్తమ వైద్యం: డాక్టర్ కె.ఎస్. సోమశేఖరరావు

కాలేయం నిశ్శబ్దంగా పనిచేసే అవయవమని... ముదిరిపోయే వరకు వ్యాధి లక్షణాలు బయటపడవని పుస్తక రచయిత, సీనియర్ హెపటాలజిస్ట్ డా. కె.ఎస్. సోమశేఖరరావు పేర్కొన్నారు. ప్రతి కుటుంబానికి కాలేయ వ్యాధుల ప్రారంభ సంకేతాలపై అవగాహన కల్పించడమే తన లక్ష్యమన్నారు.. వ్యాధి రాకముందే అడ్డుకోవడమే అత్యుత్తమ వైద్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా డా. సోమశేఖర రావు వద్ద చికిత్స పొంది కోలుకున్న పలువురు లివర్ హెల్త్ అంబాసిడర్లకు తొలి ప్రతులను అందజేశారు. ఈ పుస్తకాలను కాలేయ వ్యాధి గ్రస్తులకు, వారి కుటుంబాలకు అంకితం ఇస్తున్నట్లు ఆయన ప్రకటించారు. అలాగే, ఈ పుస్తక రచనకు స్ఫూర్తినిచ్చిన వివేకానంద్ మిశ్రాను ఈ సందర్భంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్య ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, విద్యావేత్తలు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లకు టెండర్లు

హైదరాబాద్,

పట్టణ గృహనిర్మాణ పథకం కింద కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలో ఇందిరమ్మ టవర్ల నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. ఇళ్ల (ఫ్లాట్ల) కేటాయింపు తరువాతే నిర్మాణాలు చేపట్టాలని ఇప్పటికే నిర్ణయించిన విషయం తెలిసిందే. అయితే దరఖాస్తుల ప్రక్రియ పూర్తయ్యేలోపు టవర్ల నిర్మాణానికి సంబంధించిన టెండర్ల వ్యవహారాన్ని కూడా పూర్తిచేసేందుకు హౌసింగ్ బోర్డు చర్యలు చేపట్టింది. హైదరాబాద్ మహానగరం పరిధిలోని 24 నియోజకవర్గాల్లో.. ఇప్పటివరకు స్థలాలు గుర్తించిన 16 నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఎల్‌ఐజీ టవర్ల నిర్మాణ పనులు చేపట్టేందుకు టెండర్లను ఆహ్వానించింది. బుధవారం (ఈ నెల 29) నుంచి ఆగస్టు 19 మధ్యాహ్నం 3 గంటల వరకు టెండర్లను స్వీకరించనున్నారు. మొత్తం 16 ప్రాంతాల్లో నిర్మించే ఇందిరమ్మ ఎల్‌ఐజీ టవర్లను 10 ప్యాకేజీలుగా విభజించి టెండర్లను ఆహ్వానించారు. ఒక్కో టవర్‌ను స్టిల్ట్ ం 10 అంతస్తులతో నిర్మించాలని టెండర్ నోటీసులో పేర్కొన్నారు. నిర్మాణాన్ని సంప్రదాయ/మో నోలిథిక్ కాంక్రీట్ నిర్మా ణం లేదా మరేదైనా వినూత్న సాంకేతికత (షీర్‌వాల్ టెక్నాలజీ/ప్రీకాస్ట్ టెక్నాలజీ లేదా తెలంగాణ హౌసింగ్ బోర్డు ఆమోదించిన విధంగా)తో ఒక్కో ఫ్లాట్‌ను 528.58 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించాలని పేర్కొన్నారు. దీంతోపాటు నేల పరిస్థితులకు తగిన పునాదులు, సివిల్ పను లు, అంతర్గత మౌలిక సదుపాయాల కింద నీటి సరఫరా, శానిటరీ ఫిట్టింగ్‌లు, అంతర్గత విద్యుదీకరణ, లిఫ్టులు, ఫైర్ సేఫ్టీతో నిర్మాణాలు ఉండాలని టెండర్ పొందుపరిచారు. అంతేకాకుండా.. ఈ పనులన్నింటికీ రెండేళ్ల డిఫెక్ట్ లయబిలిటీ పీరియడ్ (నిర్మాణంలో ఏవైనా లోపాలు, తప్పులు ఉంటే వాటికి నిర్మాణ సంస్థే బాధ్యత వహించే) నిబంధనను కూడా పెట్టారు. జీహెచ్‌ఎంసీ లైసెన్స్ ఉన్న బిల్డర్లు ఈ టెండర్లలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. కాగా, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో తొలిసారిగా ఇంజనీరింగ్-ప్రొక్యూర్‌మెంట్-కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) విధానాన్ని ప్రవేశపెడుతున్నారు. ఈ విధానం ఎక్కువగా జాతీయ రహదారులు, రాష్ట్రంలోని ప్రత్యేక కారిడార్ల నిర్మాణంలో ఉంటుంది. త్వరితగతిన నిర్మాణం, నాణ్యతతో ఉండేందుకే ఈపీసీ పద్ధతిని తీసుకొస్తున్నట్టు హౌసింగ్ బోర్డు ఇంజినీరింగ్ విభాగం అధికారులు తెలిపారు. హౌసింగ్ బోర్డు టెండర్ నోటీస్‌లో ఇచ్చిన ప్యాకేజీల ప్రకారం.. ఒక్క హైదరాబాద్ జిల్లా పరిధిలోనే దాదాపు 3,500 ఫ్లాట్లు రానున్నాయి.



**తొలి విడతలోని 10 ప్యాకేజీలు ఇవే..**

ప్యాకేజీ-1లో రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని మైలార్‌దేవ్‌పల్లిలో 480 ఫ్లాట్లు, మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలంలోని జల్‌పల్లి వద్ద 480 ఫ్లాట్లు కలిపి మొత్తం 960 ఫ్లాట్లకు రూ.86.40 కోట్లతో టెండర్ ఇచ్చారు.

ప్యాకేజీ-2లో హైదరాబాద్ జిల్లా పరిధిలోని నాంపల్లి వద్ద ఉన్న రెడ్‌హిల్స్‌లో 480 ఫ్లాట్లు, కుల్సుంపురలో 480, బహదూర్‌పురలోని ముసలైగూడలో 480 ఫ్లాట్లు కలిపి మొత్తం 1440 ఫ్లాట్లకు రూ.129.60 కోట్లతో టెండర్. (అన్ని ప్యాకేజీల్లో ఇదే అత్యధికం).

ప్యాకేజీ-3లో రూ.86.40 కోట్లతో రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలంలోని రాయదుర్గంలో 480 ఫ్లాట్లు, షేక్‌పేట మండలంలోని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే కాలనీలో 360 ఫ్లాట్లు, హకీంపేట దర్గాలో 120 ఫ్లాట్లు.

ప్యాకేజీ-4: హైదరాబాద్ జిల్లా పరిధిలోని సైదాబాద్ మండలం గడ్డిఅన్నారంలో 480 ఫ్లాట్లు, అంబర్‌పేట మండలంలోని అంబర్‌పేట సీపీఎల్‌లో 480 ఫ్లాట్లకు రూ.86.40 కోట్లతో టెండర్.

ప్యాకేజీ-5: రూ.55.80 కోట్లతో బేగంపేట మండలంలోని పాటిగడ్డలో 480 ఫ్లాట్లు, తిరుమలగిరి మండలంలోని బోయిన్‌పల్లిలో 140 ఫ్లాట్లు.

ప్యాకేజీ-6: రూ.43.20 కోట్లతో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కూకట్‌పల్లి మండలంలోని కేపీహెచ్‌బీ కాలనీలో 480 ఫ్లాట్లు.

ప్యాకేజీ-7: రూ.43.20 కోట్లతో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలంలోని గాజులరామారంలో 480 ఫ్లాట్లు.

ప్యాకేజీ-8: రూ.43.20 కోట్లతో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మల్కాజిగిరి మండలంలోని కౌకూర్‌లో 480 ఫ్లాట్లు.


ప్యాకేజీ-9: రూ.43.20 కోట్లతో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ మండలంలోని పోచారం ఎల్‌ఐజీ కాలనీలో 480 ఫ్లాట్లు.

ప్యాకేజీ 10: రూ.43.20 కోట్లతో రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని బండ్లగూడ ఎల్‌ఐజీ కాలనీలో 480 ఫ్లాట్లు.




# మీరాబాయి.. బంగారం

గ్లాస్గో వేదికగా జరుగుతున్న కామన్వెల్త్ గేమ్స్‌లో భారత వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను దేశానికి తొలి స్వర్ణం అందించింది. ఆదివారం జరిగిన మహిళల 48 కిలోల విభాగంలో సత్తా చాటిన మీరాబాయి అగ్రస్థానంలో పసిడి వెలుగులు విరజిమ్మింది. ఆసియా క్రీడలే తన అసలైన లక్ష్యమని, కామన్వెల్త్‌లో వందశాతం ప్రయత్నిస్తానో లేదోనని చెప్పిన ఆమె అందరి అంచనాలు అందుకుంటూ ఈ టోర్నీలో వరసగా మూడోసారి గోల్డ్‌మెడల్‌తో మురిసిపోయింది. కామన్‌వెల్త్ క్రీడల్లో వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను తన ఆధిపత్యాన్ని కొనసాగించింది. 2018, 2022లో పసిడి పతకం కొల్లగొట్టిన మీరాబాయి గ్లాస్గోలోనూ పట్టువదల్లేదు. ఫైనల్లో బరువులు ఎత్తిన భారత స్టార్ ఈ ఎడిషన్‌లో దేశానికి తొలి స్వర్ణం అందించింది. ఇదివరకు 82 కిలోలతో కామన్వెల్త్‌లో రికార్డు నెలకొల్పిన మీరాబాయి..క్లీన్ అండ్ జెర్క్ విభాగంలో తొలి ప్రయత్నంలో విఫలమైంది. రెండోసారి తడబడకుండా 82 కిలోలు, మూడో ప్రయత్నంలో 85 కిలోలు ఎత్తి సరికొత్త రికార్డు సాధించింది. అనంతరం 105 కిలోలను సైతం అవలీలగా ఎత్తిన మీరాబాయి పసిడి పతకంతో మువ్వన్నెల జెండాను రెపరెపలాడించింది. తద్వారా భారత్ పతకాల సంఖ్య మూడుకు చేరింది.




# రజతంతో మెరిసిన రిషికాంత సింగ్

కామన్వెల్త్ క్రీడల్లో భారత్ ఖాతాలో మరో పతకం చేరింది. వెయిట్‌లిఫ్టింగ్‌లో చనంబమ్ రిషికాంత సింగ్ రజతంతో మెరిశాడు. పురుషుల 60 కిలోల విభాగంలో సత్తా చాటిన అతడు మువ్వన్నెల జెండాను రెపరెపలాడించాడు. కామన్వెల్త్ రికార్డు నెలకొల్పిన రిషికాంత సింగ్ పసిడి వేటలో వెనకబడి.. వెండి వెలుగులు విరజిమ్మాడు. మలేషియా వెయిట్‌లిఫ్టర్ మొహమద్ అనిక్ బిన్ కస్దాన్ స్వర్ణం ఎగరేసుకుపోయాడు. రిషికాంత్, మొహమూద్‌లు.. ఇద్దరూ విజయవంతంగా 121 కిలోలు ఎత్తడం ఈ క్రీడల చరిత్రలో ఇదే మొదటిసారి. గ్లాస్గో వేదికగా జరుగుతున్న కామన్వెల్త్ క్రీడల్లో ఆదివారం భారత్‌కు మరో పతకం వచ్చింది. 'కార్గిల్ విజయ్ దివస్' రోజున వెయిట్‌లిఫ్టర్ చనంబమ్ రిషికాంత సింగ్ సిల్వర్ మెడల్ కొల్లగొట్టాడు. ఆర్మీ స్పోర్ట్స్‌లో రాటుదేలిన అతడు ఫైనల్లో మలేషియా మొహమద్ అనిక్ బిన్ కస్దాన్‌తో పోటాపోటీగా 121 కిలోల బరువులు ఎత్తాడు. అయితే.. క్లీన్ అండ్ జెర్క్ విభాగంలో మొహమూద్ మెరుగైన ప్రదర్శన చేయడంతో భారత స్టార్ వెండి పతకానికి పరిమితయ్యాడు. క్లీన్ అండ్ జెర్క్‌లో రిషికాంత 143 కిలోలు ఎత్తగా.. మలేషియా వెయిట్‌లిఫ్టర్ ఏకంగా 152 కిలోలు ఎత్తి పసిడి పతకం సాధించాడు. మొత్తంగా ఫైనల్లో రిషికాంత 264 కిలోలు, మొహమూద్ 273 కిలోల బరువులు ఎత్తి శభాష్ అనిపించుకున్నారు. వీరి తర్వాతి స్థానంలో నిలిచిన జోషువా మొబియా(కెన్యా) కాంస్యం సాధించాడు. మరోవిషయం.. 2022లో బర్మింగ్‌హమ్ ఆతిథ్యమిచ్చిన కామన్వెల్త్ క్రీడల్లో 55 కిలోల విభాగంలో పోటీపడిన రిషికాంత.. ఈసారి 60 కిలోల ఈవెంట్‌లో దేశం గర్వించే ప్రదర్శన చేశాడు.

# సినీ క్రికెట్ పోటీలు ప్రారంభం

విశాఖపట్నంలోని వైఎస్ఆర్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో 'ఎలైట్ క్రికెట్ లీగ్ సీజన్-2' పోటీలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సినీ నటులు శ్రీకాంత్, తరుణ్, సుధీర్ బాబు, ఓంకార్‌లతో పాటు బుల్లితెర నటులు, ప్రజాప్రతినిధులు, వైద్యులతో కూడిన మొత్తం ఆరు విభిన్న జట్లు ఈ టోర్నీలో తలపడుతున్నాయి. తొలిరోజే మ్యాచ్‌లు ఉత్కంఠభరితంగా సాగడమే కాకుండా అభిమానులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రారంభ మ్యాచ్‌లో శ్రీఇన్ఫో మిసైల్స్ జట్టు 21 పరుగుల తేడాతో ఆంధ్రా గవర్నమెంట్ లయన్స్ జట్టుపై ఘనవిజయం సాధించగా, రెండో పోరులో బుల్లితెర రేంజర్స్ జట్టు 5 పరుగుల ఉత్కంఠ తేడాతో ఆయుష్మాన్ అవెంజర్స్ జట్టును ఓడించింది. ఇక మూడో మ్యాచ్ టాలీవుడ్ థండర్స్, ఆంధ్రా పొలిటికల్ జట్ల మధ్య హోరాహోరీగా సాగింది. ఈ టోర్నీకి నగరవాసులు, క్రీడాభిమానుల నుంచి అద్భుత స్పందన లభించింది. తమ అభిమాన నటులు, ప్రముఖులను మైదానంలో చూసేందుకు ప్రేక్షకులు పెద్దఎత్తున స్టేడియానికి తరలివచ్చారు.




# హార్దిక్ కోసం చెన్నై భారీ ఆఫర్


ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందు ముంబై ఇండియన్స్‌ను వీడనున్న స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాను తమ జట్టులోకి తీసుకునేందుకు చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) తీవ్రంగా ప్రయత్నిస్తోంది. అయితే, ఈ మెగా ట్రేడింగ్ వ్యవహారంలో రెండు ఫ్రాంచైజీల మధ్య ఆసక్తికరమైన బేరసారాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. హార్దిక్‌ను వదులుకునేందుకు ముంబై ఇండియన్స్ భారీ ప్యాకేజీని డిమాండ్ చేస్తుండగా, చెన్నై అందుకు భిన్నమైన ప్రతిపాదనతో ముందుకొచ్చింది. 'హిందుస్థాన్ టైమ్స్' కథనం ప్రకారం.. హార్దిక్ పాండ్యాకు బదులుగా తమకు యువ సంచలనం ఆయుశ్ మాత్రేతో పాటు విధ్వంసకర ఆల్‌రౌండర్ శివమ్ దూబేను ఇవ్వాలని ముంబై ఇండియన్స్ కోరినట్లు సమాచారం. గత ఐపీఎల్ సీజన్‌లో దాదాపు 180 స్ట్రైక్ రేట్‌తో అదరగొట్టిన 19 ఏళ్ల మాత్రేను తమ జట్టు పునర్నిర్మాణంలో భాగంగా కీలక ఆటగాడిగా ముంబై భావిస్తోంది. అందుకే అతడిని ట్రేడింగ్‌లో చేర్చాలని పట్టుబడుతోంది. అయితే, భవిష్యత్ స్టార్‌గా ఎదుగుతాడని భావిస్తున్న ఆయుష్ మాత్రేను వదులుకునేందుకు చెన్నై సూపర్ కింగ్స్ ఎంతమాత్రం సుముఖంగా లేదు. అతడిని కాపాడుకోవాలనే ఉద్దేశంతో ముంబైకి మరో ఆకర్షణీయమైన ఆఫర్‌ను ప్రతిపాదించింది. ఈ కౌంటర్ ఆఫర్‌లో భాగంగా శివమ్ దూబే, దక్షిణాఫ్రికా డైనమిక్ బ్యాటర్ డెవాల్డ్ బ్రెవిస్‌లతో పాటు అదనంగా రూ.10 కోట్ల నగదును ముంబైకి ఇచ్చేందుకు సీఎస్‌కే సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చితే ముంబై ఇండియన్స్‌కు సుమారు రూ.20 కోట్ల విలువైన ప్రయోజనం చేకూరవచ్చు. పేస్ బౌలింగ్ చేయగల భారత మిడిల్ ఆర్డర్ ఆల్‌రౌండర్‌గా హార్దిక్ చాలా అరుదైన ఆటగాడు. అయినప్పటికీ ఐపీఎల్ 2026లో అతను కేవలం 206 పరుగులు చేసి, 4 వికెట్లు మాత్రమే తీయడంతో అతని ఇటీవలి ఫామ్ ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుతం ఒకవైపు తమ యువ ప్రతిభను కాపాడుకోవాలని చెన్నై, మరోవైపు అత్యధిక ప్రయోజనం పొందాలని ముంబై పట్టుబట్టడంతో ఈ ట్రేడింగ్ చర్చలు ప్రతిష్టంభనలో పడ్డాయి. ఈ రెండు జట్ల మధ్య ఒప్పందం కుదరకపోతే పరిస్థితిని నిశితంగా గమనిస్తున్న కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) వంటి ఇతర ఫ్రాంచైజీలు హార్దిక్‌ను దక్కించుకునేందుకు పోటీలో నిలిచే అవకాశం ఉంది.




# టీమిండియా క్లీన్ స్వీప్

## మూడో టీ20 కూడా మనదే

జింబాబ్వే పర్యటనలో యువకులతో కూడిన భారత జట్టు అద్భుత ప్రదర్శనతో అదరగొట్టింది. మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను 3-0 తేడాతో క్లీన్‌స్వీప్ చేసింది. ఆదివారం హరారే స్పోర్ట్స్ క్లబ్ వేదికగా జరిగిన ఆఖరిదైన మూడో టీ20లో టీమిండియా 35 పరుగుల తేడాతో జింబాబ్వేపై ఘనవిజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌లో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ (81) ఆకాశమే హద్దుగా చెలరేగగా, బౌలింగ్‌లో మయాంక్ యాదవ్ (3/29) తన పేస్‌తో ప్రత్యర్థిని కట్టడి చేశాడు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 192 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఓపెనర్ అభిషేక్ శర్మ (2) విఫలమైనా, మరో యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడాడు. కేవలం 49 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్సర్లతో 81 పరుగులు చేసి జట్టు భారీ స్కోరుకు బలమైన పునాది వేశాడు. అతనికి ఇషాన్ కిషన్ (29), కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (27) నుంచి మంచి సహకారం లభించింది. చివర్లో రింకూ సింగ్ (14 బంతుల్లో 25) తనదైన శైలిలో మెరుపులు మెరిపించడంతో భారత్ భారీ స్కోరును నమోదు చేసింది. జింబాబ్వే బౌలర్లలో బ్రాడ్ ఎవాన్స్ రెండు వికెట్లు పడగొట్టాడు. అనంతరం 193 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో జింబాబ్వే ఏ దశలోనూ గెలుపు దిశగా సాగలేదు. భారత బౌలర్ల ధాటికి క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయింది. ఓపెనర్ బెన్నెట్‌ను తొలి బంతికే మయాంక్ యాదవ్ పెవిలియన్ చేర్చాడు. ఆ తర్వాత యశ్ ఠాకూర్ ఒకే ఓవర్లో డియాన్ మైయర్స్ (19), కెప్టెన్ సికిందర్ రజా (0)లను ఔట్ చేసి జింబాబ్వేను కోలుకోలేని దెబ్బతీశాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా, రియాన్ బర్ల్ (43 బంతుల్లో 54 నాటౌట్) ఒంటరి పోరాటం చేశాడు. అతనికి వెస్లీ మధెవెరే (28) కాసేపు సహకరించినా, అది ఓటమి అంతరాన్ని తగ్గించడానికే సరిపోయింది. భారత బౌలర్లలో మయాంక్ యాదవ్ మూడు వికెట్లతో జింబాబ్వే పతనాన్ని శాసించాడు. యశ్ ఠాకూర్ రెండు వికెట్లు తీయగా, అశోక్ శర్మ, రవి బిష్ణోయ్ తలో వికెట్ పడగొట్టారు.



# మా అబ్బాయిని ఆదరించండి

## మహేశ్ బాబు

ఘట్టమనేని కుటుంబం నుంచి మరో హీరో వెండితెరకు పరిచయం అవుతున్న వేళ, సూపర్ స్టార్ మహేశ్ బాబు తన పూర్తి మద్దతు ప్రకటించారు. తన అన్నయ్య రమేశ్ బాబు కుమారుడు జయకృష్ణ హీరోగా నటిస్తున్న 'శ్రీనివాస మంగాపురం' సినిమా కోసం మహేశ్ ఒక ప్రత్యేక వీడియోను తన సోషల్ మీడియాలో విడుదల చేశారు. తన అబ్బాయ్ జయకృష్ణను ఆశీర్వదించాలని ఆయన అభిమానులను కోరారు. ఈ వీడియోలో మహేశ్ బాబు మాట్లాడుతూ.. "మా అన్నయ్య అబ్బాయి జయకృష్ణ నటుడిగా పరిచయం అవుతుండటం చాలా ఆనందంగా ఉంది. మా కుటుంబమంతా ఎంతో ఎగ్జైటింగ్ గా ఎదురుచూస్తోంది. సినిమా టీజర్, ట్రైలర్, పాటలు అన్నీ బాగున్నాయి. జయకృష్ణ, రాషా థడానీ జంట చూడముచ్చటగా ఉంది. వారిని అందంగా చూపించిన దర్శకుడు అజయ్ భూపతికి నా అభినందనలు" అని అన్నారు. ఈ సందర్భంగా సినిమాకు సంబంధించిన ఒక ఆసక్తికరమైన విషయాన్ని మహేశ్ పంచుకున్నారు. "ఈ సినిమా జులై 30న విడుదలవుతోంది. అదే రోజు నా మొదటి సినిమా 'రాజకుమారుడు' కూడా విడుదలైంది. నిర్మాత అశ్వినీదత్ గారే ఈ డేట్ ప్లాన్ చేసి ఉంటారని అనుకుంటున్నాను. వైజయంతి సంస్థ నుంచి నేను, రామ్ చరణ్, అల్లు అర్జున్ వచ్చాం. ఇప్పుడు జయకృష్ణ, రాషా కూడా అదే బ్యానర్ నుంచి వస్తున్నారు. ఇది వాళ్ల అదృష్టం. మా నాన్నగారి అభిమానులు, నా అభిమానులు జయకృష్ణ, రాషాలను ఆదరించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని మహేశ్ తెలిపారు.




# త్వరలో రజనీకాంత్ బయోపిక్?

భారతీయ సినిమా గర్వించదగ్గ నటుల్లో ఒకరైన సూపర్ స్టార్ రజనీకాంత్ జీవితం ఓ స్ఫూర్తిదాయక ప్రయాణం. బెంగుళూరులో ఒక సాధారణ బస్ కండక్టర్‌గా జీవితాన్ని ప్రారంభించి, అంచెలంచెలుగా ఎదిగి ప్రపంచవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్నారు. దశాబ్దాలుగా కోట్లాది మందికి ప్రేరణగా నిలుస్తున్న ఆయన జీవిత కథ త్వరలో సినిమాగా రానుందనే వార్తలు ఆసక్తిని రేపుతున్నాయి. కొంతకాలంగా రజినీకాంత్ తన ఆత్మకథ (ఆటోబయోగ్రఫీ) రాస్తున్నట్లు ప్రచారం జరుగుతుండగా, ఇప్పుడు దానిని బయోపిక్‌గా తెరకెక్కించే అవకాశాలు ఉన్నాయని కొత్త నివేదికలు వెల్లడిస్తున్నాయి. తాజా మీడియా కథనాల ప్రకారం.. రజనీకాంత్ తన ఆత్మకథను సినిమాగా మార్చే విషయంపై సన్నిహితులతో చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ఆత్మకథలో ఆయన జీవితంలోని ముఖ్యమైన ఘట్టాలు, వృత్తిపరమైన విజయాలు, ఎదుర్కొన్న సవాళ్లు, మరపురాని క్షణాలను సమగ్రంగా పొందుపరచనున్నారని సమాచారం. ఈ పుస్తకాన్ని బయోపిక్‌గా తీస్తే ఎలా ఉంటుందనే దానిపై చర్చలు జరుగుతున్నప్పటికీ, దీనిపై ఇంకా అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ప్రస్తుతం ఈ వార్త కోలీవుడ్‌లో జోరుగా ప్రచారంలో ఉంది. గతంలో రజనీకాంత్ కుమార్తె సౌందర్య కూడా తన తండ్రి ఆత్మకథ రాస్తున్న విషయాన్ని ధ్రువీకరించారు. "కష్టపడి తనకంటూ ఒక మార్గాన్ని సృష్టించుకున్న మా తలైవా, బెంగుళూరులో బస్ కండక్టర్‌గా తన పోరాటాల నుంచి కోలీవుడ్‌లో సూపర్‌స్టార్‌గా ఎదిగే వరకు తన జీవిత చరిత్రను రాయడం ప్రారంభించారు" అని ఆమె ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. ఈ పుస్తకం ఆయన జీవితం, కెరీర్‌కు సంబంధించిన పూర్తి వివరాలను అందిస్తుందని, ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తుందని సౌందర్య విశ్వాసం వ్యక్తం చేశారు. ఐదు దశాబ్దాలకు పైగా సాగిన తన సినీ ప్రస్థానంలో రజనీకాంత్ తమిళం, తెలుగు, హిందీ, కన్నడ భాషల్లో ఎన్నో అద్భుతమైన చిత్రాల్లో నటించారు. భారత ప్రభుత్వం ఆయనను పద్మభూషణ్, పద్మవిభూషణ్, దాదాసాహెబ్ ఫాల్కే వంటి అత్యున్నత పురస్కారాలతో సత్కరించింది. ప్రస్తుతం ఆయన నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో 'జైలర్ 2' చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమా అక్టోబర్ 15న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. దీంతో పాటు అశ్వత్ మారిముత్తు దర్శకత్వంలో 'ధర్మాన్' అనే మరో చిత్రంలో కూడా ఆయన నటిస్తున్నారు.

# చిట్టిబాబుగా వెంకటేశ్

విక్టరీ వెంకటేశ్, దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న కొత్త చిత్రం నుంచి కీలక అప్‌డేట్ వచ్చింది. 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం: 47- ఏకే 47' అనే టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో వెంకీ పోషిస్తున్న పాత్ర పేరును మేకర్స్ తాజాగా వెల్లడించారు. ఈ సినిమాలో ఆయన 'చిట్టి బాబు' అనే పాత్రలో ప్రేక్షకులను అలరించనున్నారు. ఈ విషయాన్ని నిర్మాణ సంస్థ హారిక అండ్ హాసిని క్రియేషన్స్ సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా ప్రకటించింది. రేపటి నుంచి సినిమాలోని ఒక్కో పాత్రను పరిచయం చేయబోతున్నట్లు తెలిపింది. ఇందులో భాగంగా వెంకటేశ్‌ను చిట్టి బాబుగా, హీరోయిన్ శ్రీనిధి శెట్టిని స్వర్ణగా, ఇతర నటులు యువీన పార్థవిని సంపూర్ణగా, రాజా ప్రజ్వల్‌ను సర్వగా పరిచయం చేయనున్నట్లు పేర్కొంది. ఇటీవలే నటుడు నారా రోహిత్ పుట్టినరోజు సందర్భంగా, ఆయన ఈ సినిమాలో నటిస్తున్నట్లు చిత్రబృందం అధికారికంగా పకటించింది. దీనికి సంబంధించి ఓ ప్రత్యేక పోస్టర్‌ను కూడా విడుదల చేయగా, అందులో ఆయన పోలీస్ అధికారి పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది.










# 'టాక్సిక్' కౌంట్‌డౌన్.. పోస్టర్ రిలీజ్

'కేజీఎఫ్' సిరీస్‌తో పాన్ ఇండియా స్టార్‌గా ఎదిగిన రాకింగ్ స్టార్ యశ్, తన తదుపరి చిత్రం 'టాక్సిక్'తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. సినిమా విడుదలకు సరిగ్గా నెల రోజుల సమయం ఉన్న నేపథ్యంలో, చిత్ర బృందం యశ్ ఇంటెన్స్ లుక్‌తో కూడిన ఓ కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ పోస్టర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉంది. తాజాగా విడుదలైన ఈ పోస్టర్‌లో యశ్ స్టైలిష్‌గా, అంతే క్రూరంగా కనిపిస్తున్నారు. రక్తంతో తడిసిన చేతులతో, ప్రశాంతంగా సిగరెట్ కాలుస్తూ ఇంటెన్స్ లుక్‌తో ఆకట్టుకుంటున్నారు. ఈ లుక్ సినిమాలోని హింసాత్మక ప్రపంచాన్ని సూచిస్తున్నప్పటికీ, కథపై ఎలాంటి క్లారిటీ ఇవ్వకుండా ఉత్కంఠను పెంచుతోంది. "అతని చేతులకు రక్తం అంటింది" అనే క్యాప్షన్‌తో మేకర్స్ ఈ పోస్టర్‌ను పంచుకున్నారు. 'టాక్సిక్: ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్' అనే ట్యాగ్‌లైన్‌తో వస్తున్న ఈ చిత్రానికి గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహిస్తున్నారు. యశ్‌తో కలిసి ఆమె ఈ కథను రాయడం విశేషం. కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ సినిమాను కన్నడ, ఇంగ్లీష్ భాషల్లో ఏకకాలంలో రూపొందించి, పలు భారతీయ భాషల్లోకి డబ్ చేయనున్నారు. యశ్‌తో పాటు నయనతార, కియారా అద్వానీ, తారా సుతారియా, హుమా ఖురేషి వంటి భారీ తారాగణం నటిస్తోంది. కేజీఎఫ్ సిరీస్ వంటి భారీ బ్లాక్‌బస్టర్ల తర్వాత యశ్ నుంచి వస్తున్న సినిమా కావడంతో 'టాక్సిక్'పై అంచనాలు ఆకాశాన్ని అంటాయి. ఈ చిత్రం ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.




# బల్కంపేట ఎల్లమ్మకు 'అగధ' టీం బోనం

ప్రముఖ దర్శకనిర్మాత ఎం.ఎస్. రాజు రూపొందిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'అగధ'. డివైన్ మిస్టిక్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమా ప్రచార కార్యక్రమాలను చిత్ర బృందం వినూత్నంగా ప్రారంభించింది. హైదరాబాద్‌లోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బల్కంపేట ఎల్లమ్మ-పోచమ్మ అమ్మవార్ల ఆశీస్సులతో ఆదివారం 'అగధ' ప్రచార జాతరకు శ్రీకారం చుట్టింది. ఆగస్ట్ 14న ప్రపంచవ్యాప్తంగా భారీ విడుదలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో, ఇవాళ చిత్ర యూనిట్ సభ్యులు బల్కంపేట ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కథానాయిక కామాక్షి భాస్కర్ల సంప్రదాయబద్ధంగా అలంకరించుకుని, భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు ఎం.ఎస్. రాజు, నిర్మాత కాశీ విశాలాక్షి బలుసు, సమర్పకులు అజయ్ కేఆర్, హీరో శ్రవణ్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఎన్.వి.ఎన్. సుబ్బరాజు తమ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్మాత కాశీ విశాలాక్షి బలుసు మాట్లాడుతూ, "దేవి' చిత్రం సృష్టించిన చరిత్ర లాంటి వైబ్స్ ఇప్పుడు 'అగధ' విషయంలోనూ కనిపిస్తున్నాయి. పోస్టర్, టీజర్‌తోనే సినిమాపై అంచనాలు పెరిగాయి.

Udayam :- printed.Editor ,Pblished and owendBy M.chandrasekher.plat no12journalistcolany.near B.t.r.Nagar.vartha office Back said k.g.Road.kurnool.andrapradesh.pin518001.Printed At Uttejitha printers.Kurnool.Ap cell.9000313849. RNI Aptel2015/62159.